


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | బుధవారం | 19.11.2025 | సంపుటి : 2 | సంచిక :285 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Wednesday | 19.11.2025 | volume : 2 | Issue : 285 | Pages : 8 | Cost : 2/- |




# పత్తి రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలి

## మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే..

- అధైర్యపడకండి... అండగా ఉంటాం
- పత్తి, సోయాబిన్ పంటలను వెంటనే కొనాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఆదిలాబాద్ పత్తి మార్కెట్, నేరడిగొండలో కొనుగోలు కేంద్రాల పరిశీలన
- 21న జాతీయ రహదారుల దిగ్బంధానికి పిలుపు

ఆదిలాబాద్, నవంబరు 18 : రైతులు ఎవరూ అధైర్య పడకండి, మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ ఎల్లవేళలా అండగా ఉంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతులకు ధైర్యం చెప్పారు. మళ్లీ బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తుంది.. రైతుల సమస్యలు పరిష్కారం చేస్తామని

-మిగతా 2 లో..

# హైదరాబాద్ అభివృద్ధితో పాటు కొత్త నగరం నిర్మాణం

## కేంద్రం నిర్దేశించిన లక్ష్యంలో మేమూ భాగస్వామ్యం

- ఫ్యూచర్ సిటీ, ట్రిపుల్ ఆర్, మూసీ రివర్ ఫ్రంట్‌తో మార్పు
- వేగంగా అనుమతులు లభిస్తేనే పురోగతి సాధ్యం
- పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో రేవంత్ రెడ్డి

హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంతో పాటు కొత్త నగరాన్ని నిర్మించాలని భావిస్తున్నట్లు సిఎం రేవంత రెడ్డి వెల్లడించారు. ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 పేరుతో కొత్త ప్రణాళిక రూపొందించాం. ప్రపంచంలోనే ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం కృషి చేస్తోంది.



హైదరాబాద్, నవంబర్ 18 : కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల్లో తెలంగాణ కూడా భాగమవుతుందన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు కేంద్రం త్వరగా అనుమతులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు లభిస్తే హైదరాబాద్ అభివృద్ధి చెందుతుందని.. తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థలో మరింత కీలకంగా మారుతుందని చెప్పారు. హోటల్ ఐటీసీ

-మిగతా 2 లో..

# జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో తెలంగాణ నం.1


## కేంద్ర జలశక్తి శాఖ ప్రకటన

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డుల ప్రదానం



న్యూఢిల్లీ, నవంబర్ 18 : జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన ఆరో జాతీయ జల అవార్డులు-2024లో జాతీయ స్థాయిలో తెలంగాణ తొలి ర్యాంకును సాధించింది. కేంద్ర ప్రభుత్వం-2024లో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 5,20,362 పనులని పూర్తిచేసింది. జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రాలకు భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం పురస్కారాలు ప్రదానం చేశారు. జల్

-మిగతా 2 లో..




# ఐ-బొమ్మ కేసు.. రంగంలోకి ఈడీ

## హైదరాబాద్ సీపీకి ఈడీ లేఖ

హైదరాబాద్, నవంబర్ 18 : 'ఐ బొమ్మ' కేసులోకి ఈడీ రంగంలోకి దిగింది. దీనికి సంబంధించి హైదరాబాద్ సీపీకి ఈడీ లేఖ రాసింది. ఐ బొమ్మ కేసులో మనీ లాండరింగ్ జరిగినట్టు ఈడీ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఈ కేసుకి సంబంధించిన వివరాలు ఇవ్వాలని ఈడీ రాసిన లేఖలో పేర్కొంది. ఇప్పటికే ఐ బొమ్మ యజమాని ఇమ్మడి రవి, అలియాస్ ఐబొమ్మ రవి బ్యాంక్ ఖాతా నుంచి రూ. 3.5 కోట్లు ఫ్రీజ్ చేసిన పోలీసులు.. విదేశీ బ్యాంక్ అకౌంట్ల నుంచి పెద్దమొత్తంలో రవి ఖాతాకు నిధులు బదిలీ అయినట్టు భావిస్తున్నారు. నెలకు రూ. 15లక్షలు క్రిప్టో వాలెట్ నుంచి రవి

-మిగతా 2 లో..

# మావోల మరణాలకు అర్బన్ నక్సల్స్ కారణం

## బతికున్న వారు వెంటనే లొంగిపోవాలి..

### కేంద్రమంత్రి బండి సంజయ్ హితవు

వేములవాడ, నవంబర్ 18 :అర్బన్ నక్సల్స్ పట్టణాల్లో జల్సా చేస్తున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. మావోయిస్టుల మరణాలకు అర్బన్ నక్సల్స్ కారకులని తెలిపారు. నక్సల్స్‌కు సపోర్ట్ చేసిన అర్బన్ నక్సల్స్ ద్రోహులని అభివర్ణించారు. తక్షణమే తుపాకీ వీడి జన జీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచించారు. వారిని చూసి మోసపోవద్దంటూ ప్రజలకు ఆయన స్పష్టం చేశారు. మంగళవారం వేములవాడలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ

-మిగతా 2 లో..




# హిడ్మా ఎన్‌కౌంటర్

## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

**మారేడుమిల్లిలో ఎన్‌కౌంటర్.. ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోల హతం**

మావోయిస్ట్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే అనేకమంది లొగిపోగా, పలువురు అగ్రేతలు పోలీస్ తూటాలకు బలయ్యారు. తాజాగా మరో అగ్రనేత హిడ్మా సైతం నేలకొరిగాడు. వచ్చే మార్చి లోగా నక్సల్స్‌ను అంతం చేస్తామన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటనకు అనుగుణంగా ఆపరేషన్ కగార్‌తో బలగాలు దూసుకు పోతున్నా యి. తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు -మావోయిస్టుల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు.



# తుమ్మలను అనవసరంగా వదులుకున్నారు..

- అందుకే బిఆర్ఎస్ మూడోసారి మట్టి కరిచింది
- తెలంగాణలో ప్రతిపక్షం అన్నింటా ఫెయిల్
- ఇప్పుడా బాధ్యతను జాగృతి పోషిస్తుంది
- ఖమ్మంలో మీడియాతో కవిత సంచలన వ్యాఖ్యలు



రాష్ట్రంలో అధికార పక్షం, ప్రతిపక్షం బాధ్యతగా వ్యవహరించటంలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురా లు కవిత విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన బలమైన నేత తుమ్మల నాగేశ్వరావును బీఆర్ఎస్ వదులుకోవడంతోనే మూడో సారి అధికారంలోకి రాకుండా పోయిందంటూ వ్యాఖ్యలు చేశారు. తుమ్మల బయటకు వెళ్లడంతోనే రాష్ట్రంలో గులాబీ పార్టీ పరిస్థితి తలకిందులైందన్నారు.

-మిగతా 4లో..

# ఏసీబీ రాకతో గోడదూకిన లంచగొండి ఎస్ఐ

## పట్టుకుని విచారణ చేపట్టిన పోలీసులు

### ఎస్ఐ పట్టివేతతో గ్రామస్థుల సంబరాలు

మెదక్, నవంబర్ 18 : అవినీతికి అడ్డుకట్ట వేసే దిశగా ఏసీబీ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు. తాజాగా, మెదక్ జిల్లా టెక్మాల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై రాజేష్ ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటన






# వాట్సాప్‌లో మీ సేవ పోర్టల్

## నేరుగా పొందేలా అవకాశం

### ప్రారంభించిన తెలంగాణ ఐటి మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబర్ 18 : రాష్ట్రంలో మీ సేవ సేవలు అందుబాటులోకి వచ్చాక కుల, ఆదాయ వంటి ఇతరత్రా సర్టిఫికెట్స్ పొందడం ఈజీ అయిపోయింది. అయితే ఈ సేవలను ప్రజలకు మరింత

-మిగతా 3 లో..

# ఏపీ ప్రభుత్వ తీరుపై అభ్యంతరం

## పేరుమార్చి బనకచర్ల నిర్మాణం

### మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి



న్యూఢిల్లీ, నవంబర్18 : పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం పేరు మార్చి చేపడుతోందని, ఆ ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకించామని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రితో భేటీ అనంతరం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. "ఏపీ ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక

-మిగతా 2 లో..




## జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో
# తెలంగాణ నం.1

(మొదటిపేజీ తరువాయి)

సంచయ్ జన్ భాగీదారీని ఉత్తమంగా అమలు చేసిన రాష్ట్రాలు, జిల్లాలు, స్థానిక సంస్థలకు కేంద్రప్రభుత్వం 100 అవార్డులను ప్రకటించింది. ఇందులో మూడు రాష్ట్రాలు, 67 జిల్లాలు, 6 మున్సిపల్ కార్పొరేషన్లు, ఒక పట్టణ స్థానిక సంస్థ, రెండు భాగస్వామ్య మంత్రిత్వ శాఖలు/విభాగాలు, రెండు పరిశ్రమలు, మూడు ఎన్‌జీఓలు, ఇద్దరు దాతలు, 14 మంది నోడల్ అధికారులు ఉన్నారు. క్షేత్రస్థాయిలో జల సంరక్షణలో ప్రజలు, సంఘాలు, కార్పొరేట్ సంస్థలను భాగస్వాములను చేసే లక్ష్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. రాష్ట్రాలను ఐదు జోన్లుగా విభజించారు. ప్రతి ఒక్కరూ కనీసం 10 వేల కృత్రిమ రీఛార్జి, స్టోరేజ్ నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశిరచారు. ఇందులో రూఫ్‌టాప్ వాన నీటి సంరక్షణ, చెరువులు, కుంటలు, బావుల పునరుద్ధరణ కార్యక్రమాలను చేర్చారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మున్సిపల్ కార్పొరేషన్లను మూడు కేటగిరీలుగా విభజించి అవార్డులు ప్రకటించారు. మొదటి కేటగిరీలో ఎంపికైన వాటికి రూ.2 కోట్లు, రెండో కేటగిరీలో కోటి రూపాయలు, మూడో కేటగిరీలో రూ.25 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. జిల్లాల విభాగంలో కేటగిరీ-1 కింద దక్షిణ జోన్ నుంచి మూడు జిల్లాలను ఎంపిక చేయగా.. ఆ మూడింటినీ తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకుంది. ఒక్కో జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున మొత్తం రూ.6 కోట్ల నగదు బహుమతి అందజేసింది. ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలు ఈ నగదు బహుమతిని సాధించాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఏరియాలో జల సంరక్షణ చర్యలు చేపట్టినందుకు.. హైదరాబాద్ మెట్రో కార్పొరేషన్ నీటి సరఫరా, మురుగునీటి బోర్డు మున్సిపల్ కార్పొరేషన్ల విభాగంలో రెండో ర్యాంకు సాధించింది. రూ.2 కోట్ల నగదు బహుమతిని సొంతం చేసుకొంది. ఈ విభాగంలో కేటగిరీ-2లో వరంగల్, నిర్మల్, జనగామ, జిల్లాలు దక్షిణ జోన్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచి రూ.కోటి చొప్పున బహుమతి గెలుచుకున్నాయి. కేటగిరీ-3లో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ 1, 3 ర్యాంకుల్లో నిలిచి.. రూ.25 లక్షల చొప్పున నగదు బహుమతి సొంతం చేసుకున్నాయి. ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కుమురం భీం ఆసిఫాబాద్, మెదక్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలకు నోడల్ అధికారిగా వ్యవహరించిన కేంద్ర జల సంఘానికి చెందిన ఎ.సతీశ్‌కు కూడా అవార్డు దక్కింది.

# ఐ-బొమ్మ కేసు.. రంగంలోకి ఈడీ

(మొదటిపేజీ తరువాయి)

ఖాతాకు బదిలీ అయినట్టు తెలుస్తోంది. వీటిపై ఈడీ దర్యాప్తు చేయనుంది. మరోవైపు.. ఈ కేసుకి సంబంధించిన రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఐ బొమ్మ రవి నేరాన్ని అంగీకరించినట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. ఐ బొమ్మ, బప్పం టీవీ పేరు మీద 17 వెబ్సైట్లు నిర్వహించినట్లు గుర్తింపు. క్రిప్టో కరెన్సీ వాలెట్ నుంచి రవి ఎన్నారై ఖాతాలకు నగదు బదిలీ చేశాడు. ఐబొమ్మ రవిని పట్టించిన రెండు డొమైన్లు ఒక డొమైన్ అమెరికాలో.. మరొక డొమైన్ అమీర్‌పేట్‌లో రిజిస్టర్ చేసిన రవి. విదేశీ పౌరసత్వం తీసుకున్న ఐ బొమ్మ రవి. దేశ డిజిటల్ భద్రతకు రవి ప్రమాదకరం అని పోలీసులు తెలిపారు.

## ఏసీబీ రాకతో గోడదూకిన
# లంచగొండి ఎస్ఐ

(మొదటిపేజీ తరువాయి)

స్థానికంగా సంచలనం రేపింది. వివరాల్లోకి వెళితే.. ఎస్సై రాజేష్ ఓ వ్యక్తి నుంచి రూ.50వేలు లంచం తీసుకుంటున్నారనే సమాచారంతో ఏసీబీ అధికారులు టెక్మాల్ పోలిస్ స్టేషన్‌లో ఆకస్మికంగా దాడులు చేశారు. ఏసీబీ అధికారుల రాకను గమనించిన ఎస్సై రాజేష్ పరారయ్యే ప్రయత్నం చేశాడు. అయితే, అప్రమత్తమైన ఏసీబీ బృందం వెంటాడి అతన్ని పట్టుకుంది. అనంతరం అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. ఈ ఘటనపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సై రాజేష్ అవినీతిపరుడిగా వ్యవహరిస్తున్నాడని గతంలోనే పలుమార్లు ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. చివరికి అతను ఏసీబీకి చిక్కడంతో ప్రజలు పటాకులు కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరిపారు. టెక్మాల్ వీధుల్లో ప్రజల ఆనందోత్సాహం అంబరాన్ని తాకింది.

# పేరుమార్చి బనకచర్ల నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)

కూడా వ్యతిరేకిస్తున్నాయి. ఆ ప్రాజెక్టును పరిగణనలోకి తీసుకోవద్దని కేంద్రమంత్రిని కోరాం. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు భూ సేకరణ కోసం కర్ణాటక జీవో జారీ చేసింది. 519 మీటర్లకంటే ఎక్కువ ఎత్తు పెంచవద్దని సుప్రీంకోర్టు స్టే ఉంది. స్టే ఉండగానే కర్ణాటక ప్రభుత్వం ఎత్తు పెంచేందుకు చర్యలు చేపట్టింది. కర్ణాటక ప్రభుత్వం తెచ్చిన జీవోను కేంద్రజల్‌శక్తి మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. తెలంగాణలోని పలు ఇరిగేషన్ ప్రాజెక్టులను నిధులివ్వాలని కోరాం. మా ప్రభుత్వంలో కేఆర్ఎంబీ టెలీమెట్రీ స్టేషన్ పనుల్లో పురోగతి వచ్చింది. కేఆర్ఎంబీ టెలీమెట్రీ స్టేషన్ పనులు త్వరగా పూర్తి చేయాని అడిగాం.. మరో 20 టెలీమెట్రీ స్టేషన్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఫేజ్-2లో 9, ఫేజ్-3లో 11 నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు" అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.



# ఇందిరా గాంధీ జయంతి..
## మహిళలకు తెలంగాణ ప్రభుత్వం కానుక

**హైదరాబాద్:** తెలంగాణలోని మహిళలకు కోటి చీరలు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళల సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం కోటి మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తోందని చెప్పారు. సమాజంలో మహిళల గౌరవం, ఆత్మవిశ్వాసం పెంపొందించే దిశగా ప్రభుత్వం తీసుకున్న ప్రగతిశీల పథకం ఇదని వెల్లడించారు. బుధవారం (నవంబర్ 19) నుంచి డిసెంబర్ 9 వరకు గ్రామీణ ప్రాంతాల్లో మొదటి విడతగా, మార్చి 1 నుంచి 8 వరకు రెండో విడతగా పట్టణాల్లో చీరల పంపిణీ జరగనుంది. మహిళలకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న కానుక ఇది అని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

# అధైర్యపడకండి.. అండగా ఉంటాం



(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు ఎటువంటి కష్టం లేకుండా చూసుకున్నామని, ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతీ ధాన్యం గింజ కొన్నామని కేటీఆర్ గుర్తుచేశారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం నేరడిగొండ జిన్నింగ్ మిల్లు వద్ద సోయాబీన్, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను కేటీఆర్ పరిశీలించారు. కేసీఆర్ హయాంలో రైతులకు ఎటువంటి కష్టం లేకుండా చూసుకున్నామని, ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతీ ధాన్యం గింజ కొన్నామని గుర్తుచేశారు. పండించిన పంట కొనే దిక్కులేక, పట్టించుకొనే నాథుడు లేక సంక్షోభంలో చిక్కుకున్న రైతాంగానికి బాసటగా నిలవాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. మద్దతు ధర అందక దగాపడ్డ రైతులకు భరోసా ఇచ్చేందుకు పోరుబాట పట్టేందుకు సన్నద్ధమైంది.

### 21న జాతీయ రహదారుల దిగ్బంధం

అన్నదాతలకు మద్దతుగా ఈ నెల 21న జాతీయ రహదారుల దిగ్బంధం నిర్వహించనున్నట్లు కెటీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ అన్నదాతలు భారీగా తరలి రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతాంగం ముఖ్యంగా పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఆందోళన చేపడుతున్నామని అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డులో పత్తి, సోయా రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమకు ఎదురవుతున్న సమస్యలను తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడంలేదని కేటీఆర్‌కు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నలకు ఇచ్చిన హామీలన్నింటిని పక్కన పెట్టిందని, కనీసం పండిన పంటలను అమ్ముకోవడంలో కూడా సహకారం అందించడం లేదని తెలిపారు. రైతన్నల సమస్యల పరిష్కారానికి పోరాటాలు మాత్రమే మార్గం. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలపైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు అన్ని రకాల పోరాటాలను చేసేందుకు మా పార్టీ సంసిద్ధంగా ఉన్నది. పార్టీ రైతన్నలకు అండగా ఉంటుంది. మొన్న ఆత్మహత్య చేసుకున్న హడావు దీపక్ కుటుంబానికి పార్టీ తరఫున కొంత ఆర్థిక సహాయం చేస్తాం. కిసాన్ కపాస్ యాప్ సంబంధం లేకుండా పంట కొనుగోలు చేయాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### చరిత్రలో ఎప్పుడు లేనంత దారుణంగా రైతుల పరిస్థితి

రైతులతో మాట్లాడిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదు అని అంటే ఎందుకు ఈ రోజు అదిలాబాద్ మార్కెట్ యార్డ్‌ని బంద్ పెట్టారు. మార్కెట్ యార్డులో రైతన్నలను కలుస్తామంటే ప్రభుత్వం ఎందుకు అడ్డంకులు కల్పించింది. చరిత్రలో ఎప్పుడు లేనంత దారుణంగా పత్తి కొనుగోలు సోయా రైతుల పరిస్థితి మారింది. కిసాన్ కపాస్ మొబైల్ అప్లికేషన్ అని తీసుకువచ్చి దాని ద్వారానే పంటలు కొంటాం అంటున్నారు. మరి కనీసం ఫోన్లు లేని రైతన్నల పరిస్థితి ఏమిటి? ఆదిలాబాద్ జిల్లాలో మొబైల్ నెట్‌వర్క్ కనెక్టివిటీ అన్నిచోట్ల ఉండదు. మరి ఇలాంటి సందర్భంలో రైతన్నల పరిస్థితి ఏమిటో చెప్పాలి అని కేటీఆర్ అడిగారు. రాష్ట్రంలో భారీగా అకాల వర్షాలు పడినందు వలన పత్తి తేమశాతం ఎక్కువగా ఉన్నది. చలి కూడా గతంలో కంటే ఎక్కువగా ఉన్నది అందుకే పత్తిలో తేమశాతం ఉన్నది. గతంలో మా ప్రభుత్వం ఉన్నప్పుడు కేంద్రం పైన ఒత్తిడి తీసుకొచ్చి 20 నుంచి 22 శాతం తేమ ఉన్న పంటను కూడా కొనిపించాము. కానీ ఇప్పుడు కేవలం 12 శాతం తేమ ఉంటే కూడా కొనుగోలు చేయము అని చేతులు ఎత్తేసింది. రైతులు పంటలు అమ్ముకోలేక ఆత్మహత్యలు చేసుకుంటే కూడా పట్టించుకునే వారు లేరు కనీసం అడిగే వారు కూడా లేరు అని పేర్కొన్నారు.

### కనీస మద్దతు ధర ఎక్కడ?

కనీస మద్దతు ధర రూ. 8,100 రైతుకు దక్కాల్సింది కానీ ఐదారు వేలు కూడా దక్కడం లేదు. సోయాబీన్ అమ్మకానికి సంబంధించి ఫింగర్ ప్రింట్ కావాలని చెప్పి ఒక నిబంధన పెట్టి అనేక ఇబ్బందులు గురి చేస్తున్నారు. సొంత తల్లిదండ్రుల పేరు మీద ఉన్న పంటలు బిడ్డలు అమ్మాలంటే కూడా కొనుగోలు చేయడం లేదు. పత్తి పంట ఎకరానికి కేవలం 7 క్వింటాళ్లు మాత్రమే కొంటామనే ఒక అర్థరహితమైన నిబంధన పెట్టారు. ఆదిలాబాద్‌లో ఉన్న భూసార పరిస్థితుల వలన పది పదిహేను క్వింటాళ్ల వరకు ఎకరానికి పండుతుంది మరి మిగిలిన పంటను ఎక్కడ అమ్ముకోవాలి. ఈరోజు మేము రైతన్నలను కలవడానికి వెళ్తున్నామని తెలుసుకున్న ప్రభుత్వం నాటకాలు మొదలుపెట్టారు అని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్రంతో వీడియో కాన్ఫరెన్స్ అంటూ నాటకాలు మొదలుపెట్టారు. కానీ నిన్న జరిగిన క్యాబినెట్లో 50 శాతానికి పైగా తెలంగాణ జిల్లాలో పండుతున్న పత్తి పంట పైన కనీసం మాట్లాడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు సరఫరా నుంచి మొదలుకొని యూరియా సప్లై దాకా చివరికి పంట అమ్మకానికి సంబంధించి కూడా తీవ్రమైన సమస్యలు ఉన్నాయి. అధిక వర్షాల వలన నష్టపోయిన రైతన్నలందరికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం చెల్లించాలి. నష్టపోయిన ప్రతి రైతన్నకు ఎకరానికి 20000 చొప్పున కనీస నష్టపరిహారం చెల్లించాలని పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం. స్థానిక బిజెపి, కాంగ్రెస్ నేతలు తమ ప్రభుత్వాలపైన ఒత్తిడి తీసుకువచ్చి రైతన్నలకు న్యాయం చేయాలి. వెంటనే ఇక్కడి కేంద్ర మంత్రులు, తెలంగాణ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేలా స్థానిక రైతుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకుపోవాలి. లేకుంటే వారి పైన రైతన్నల పోరాటం తప్పదు అని కేటీఆర్ హెచ్చరించారు.

# వాట్సాప్‌లో మీ సేవ పోర్టల్

(మొదటిపేజీ తరువాయి)

చేరువ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పదే పదే మీ-సేవ కేంద్రాలకు వెళ్లే శ్రమ తగ్గించడానికి, మీ-సేవకు సంబంధించిన అన్ని సేవలను ఇకపై వాట్సాప్ ద్వారానే అందించనుంది. తెలంగాణలో ఇకపై వాట్సాప్‌లోనే మీ-సేవ సర్టిఫికెట్లు అందనున్నాయి. వాట్సాప్ మీసేవ సర్వీసులను బంజారాహిల్స్ లోని తాజ్ కృష్ణలో మంత్రి శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. 38 ప్రభుత్వ విభాగాలకు చెందిన 580కి పైగా మీ సేవా సర్వీసులను వాట్సాప్ ద్వారా పొందే విధంగా ఏర్పాట్లు చేశారు. మెటా, మీ సేవ సంయుక్త భాగస్వామ్యంతో ఈ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. మీ సేవ సెంటర్స్ చుట్టూ తిరిగే పని లేకుండా సేవలను సులభతరం చేసింది తెలంగాణ ప్రభుత్వం.. వినియోగదాలు వాట్సాప్ లోనే సర్టిఫికెట్స్ పొందే అవకాశం కల్పించింది. మీ-సేవ సెంటర్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత దానికి సంబంధించిన తాజా అప్‌డేట్స్ అన్నీ వాట్సాప్‌లోనే చెక్ చేసుకోవచ్చు. అంతేకాకుండా దరఖాస్తు చేసిన సర్టిఫికెట్ ఆమోదం పొందితే ఆ సర్టిఫికెట్‌ను సైతం వాట్సాప్ ద్వారానే డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. 8096958096 వాట్సాప్ నెంబర్ ద్వారా మీ సేవ సర్వీసెస్ ఉపయోగించుకోవచ్చు. ఇన్కమ్ సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్, రెసిడెన్సీ సర్టిఫికెట్, కమ్యూనిటీ / డేట్ ఆఫ్ బర్త్, పోలీస్ చలాన్, రెన్యువల్ ఆఫ్ రేషన్ షాప్స్, టెంపుల్ సర్వీసెస్, బిల్డింగ్ పర్మిషన్, వెహికిల్ లైఫ్ ట్యాక్స్, లైసెన్స్, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు ఇక వాట్సాప్ లోనే పొందొచ్చు. త్వరలోనే మరిన్ని వాట్సాప్ సర్వీసులను ప్రారంభించనున్నది ప్రభుత్వం.. వాట్సాప్ లో 580 ప్రభుత్వ సర్వీసెస్ ను అందించడానికి ప్రభుత్వ ప్రణాళికలు చేస్తోంది.

## కేంద్రం నిర్దేశించిన లక్ష్యంలో
# మేమూ భాగస్వామ్యం

(మొదటిపేజీ తరువాయి)

కోహినూర్‌లో నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో సీఎం మాట్లాడారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తే దేశాభివృద్ధి మరింత వేగవంతమవుతుంది. కేంద్రం నిర్దేశించుకున్న 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమిలో రాష్ట్ర వాటా 10 శాతం ఉండాలని భావిస్తున్నట్లు ఈ సందర్భంగా సిఎం వెల్లడించారు. జీడీపీలో ప్రధానంగా 5 మెట్రోపాలిటన్ నగరాలైన దిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ దేశానికి ఎంతో కీలకంగా ఉన్నాయి. కేంద్రం సహకరించకుంటే రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు, ఆర్ఆర్ఆర్, మూసీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాల్సి ఉందన్నారు దేశానికి పెద్దన్నగా ఉన్న ప్రధాని మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి. మోదీ గుజరాత్ మోడల్ రూపొందించుకున్నట్లే మేం తెలంగాణ మోడల్ తీసుకొచ్చాం. ఆయన సబర్మతి నది ప్రక్షాళన చేపట్టినట్లే మేం మూసీ పునరుజ్జీవం చేస్తున్నాం. గుజరాత్‌కు మోదీ ఇచ్చిన సహకారాన్నే మేం తెలంగాణకు కోరుతున్నాం అని వివరించారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. తరవాత అభివృద్ధి గురించే మాట్లాడుతామని అన్నారు. అభివృద్ధిలో దూసుకు వెళ్లాలలన్నదే తమ అభిమతమని అన్నారు. మా పోటీ ఇతర రాష్ట్రాలతో కాదని, టోక్యో, సింగపూర్ లాంటి వాటితోనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, ఏపీ మంత్రి పొంగూరు నారాయణ, గుజరాత్ మంత్రి కనుభాయ్ మోహన్‌లాల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.


# అర్బన్ నక్సల్స్ ఉచ్చులో పడొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. పైరవీలు చేసుకుంటూ ఆస్తులు పోగేసుకుంటున్నారని అర్బన్ నక్సల్స్‌పై నిప్పులు చెరిగారు. వారి మాటలు నమ్మి అమాయక,పేద ప్రజలు తుపాకీ పట్టి అడవుల్లో తిండి తిప్పలు లేకుండా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో 4 నెలల గడువు మాత్రమే ఉదంటూ ఈ సందర్భంగా మావోయిస్టులకు ఆయన గుర్తు చేశారు. వచ్చే మార్చి నాటికి మావోయిజాన్ని అంతం చేసి తీరుతామని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లి ఏజెన్సీ ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. దీనిలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, అగ్రనేత హిడ్మాతోపాటు పలువురు మావోయిస్టులు మరణించారు. వారి మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం రంప చోడవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంతో ఆ ప్రాంతంలో భారీగా పోలీసులను మోహరించారు. మరోవైపు 2026 మార్చి నెలాఖరు నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆపరేషన్ కగార్‌ను తెరపైకి తీసుకు వచ్చి.. మావోయిస్టులు లక్ష్యంగా వారి ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాలతో కూంబింగ్ నిర్వహిస్తోంది. దాంతో వేలాది మంది మావోయిస్టులు మరణించారు. వందలాది మంది ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. భారీగా మావోయిస్టులను అరెస్ట్ చేశారు. మార్చి నెలాఖరు నాటికి మావోయిస్టులను నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో బండి వ్యాఖ్యలు ప్రాధన్యం సంతరించుకున్నాయి.

## పదేళ్ల క్రితం నిర్వహించిన
# గ్రూప్-2 ఫలితాలు రద్దు..
## తెలంగాణ హైకోర్టు ఆద్దేశం

**హైదరాబాద్:** పదేళ్ల క్రితం నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ఎంపిక జాబితాను తెలంగాణ హైకోర్టు రద్దు చేసింది. 2015- 16లో నిర్వహించిన గ్రూప్-2లో ఎంపికైన వారి జాబితాను రద్దు చేస్తూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. హైకోర్టు ఆదేశాలను టీజీపీఎస్సీ ఉల్లంఘించిందని, పరిధిదాటి వ్యవహరించిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పునర్ మూల్యాంకనం చేసి అర్హుల జాబితా నిర్ణయించాలని, ఈ ప్రక్రియ 8 వారాల్లో ముగించాలని హైకోర్టు ఆదేశించింది. వైట్నర్, దిద్దుబాటు ఉన్న జవాబుపత్రాల మూల్యాంకనంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ట్యాంపరింగ్ జరిగినట్లు తెలిసినా.. మూల్యాంకనం చేయడం చట్టవిరుద్ధమని కోర్టు పేర్కొంది. సాంకేతిక కమిటీ సూచన ప్రకారం పునర్‌మూల్యాంకనం చేయాలని ఆదేశించింది. 2015లో టీజీపీఎస్సీ గ్రూప్-2 నోటిఫికేషన్ జారీ చేసింది. 2016 నవంబర్‌లో రాతపరీక్షలు నిర్వహించింది. 2019లో గ్రూప్-2 నియామకాలు చేపట్టింది. దీనిపై



పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ భీమపాక తీర్పు వెలువరించారు.

# రాహుల్ సిప్లిగంజ్ వివాహం..
## సీఎం రేవంత్‌ను ఆహ్వానించిన సింగర్

**హైదరాబాద్:** గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ అతి త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నాడు. కాబోయే భార్య హరిణ్యతో కలిసి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం సాయంత్రం మీట్ అయ్యారు. తమ వివాహానికి ఆహ్వానిస్తూ పెళ్లి శుభలేఖను అందించారు. రాహుల్-హరిణ్యల వివాహం ఈ నెల 27న జరగనుంది. వీరిద్దరికీ ఆగస్టులో నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. తెదేపా నేత, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి సోదరుడి కుమార్తె హరిణ్యా రెడ్డి. ఓల్డ్ సిటీ నుంచి 'ఆస్కార్' వరకూ వెళ్లిన కుర్రాడంటూ రాహుల్‌ను 'గద్దర్' అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో సీఎం రేవంత్ కొనియాడిన విషయం తెలిసిందే. 'కాలేజ్ బుల్లోడా', 'వాస్తు బాగుందే', 'రంగా రంగా రంగస్థలానా', 'బొమ్మోలే ఉన్నదిరా పోరి' లాంటి సినిమా పాటలు, 'ఓ నా రాహులా', బోనాలు, వినాయక చవితి తదితర స్పెషల్ సాంగ్స్‌తో రాహుల్ శ్రోతలను విశేషంగా అలరించారు. 'రంగమార్తాండ'తో నటుడిగానూ



ఆకట్టుకున్నారు. కాలభైరవతో కలిసి రాహుల్ పాడిన 'నాటు నాటు' (ఆర్ఆర్ఆర్) పాటకు ఆస్కార్ అవార్డు దక్కింది.

# పత్తికి మద్దతు ధర ఇచ్చి కొనాలి

- ఢిల్లీకి వెళ్లి పత్తి సమస్యలు ప్రధానికి తెలుపాలి
- లేదంటే సిఎం ఇంటిముందే పత్తిపోసి ధర్నా చేస్తా
- వరంగల్ ఎనుమాముల మార్కెట్ సందర్శించిన హరీష్ రావు



**వరంగల్, నవంబరు 18 :** పత్తి రైతుకు మద్దతు ధర ఇవ్వకపోతే తెల్ల బంగారాన్ని రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలస్ ముందు పోసి ఇంటిని ముట్టడిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు వార్నింగ్ ఇచ్చారు. మంగళవారం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను హరీష్ రావు, బీఆర్ఎస్ నేతలు పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఖరితో రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. సీసీఐ తుగ్లక్ చర్యల వల్ల రైతులు రోడ్డున పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు విధిలేక దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నిలువునా ముంచుతున్నాయని మాజీ మంత్రి విమర్శించారు. రేవంత్ రెడ్డి అరవైసార్లు ఢిల్లీకి వెళ్లారని.. మూటలు పంపుతున్నారు గానీ రైతుల సమస్యలు బడేబాయ్‌కు చెప్పరా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెట్టారని.. మరి రైతులకు మద్దతు ధర ఇప్పించరా అంటూ నిలదీశారు. కపాస్ యాప్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలకంటే పంటపొలాల్లో దిష్టి బొమ్మలు నయమంటూ వ్యాఖ్యలు చేశారు. విదేశాల నుంచి పత్తి దిగుమతి చేసుకునేందుకు నిబంధనలు సడలించారని.. కానీ రైతులకు మాత్రం న్యాయం చేయడం లేదని మండిపడ్డారు. ఇప్పటి వరకూ 406 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రైతులు కన్నీళ్లు పెట్టుకుంటుంటే సీఎం రేవంత్ రెడ్డి విజయోత్సవాలు జరుపుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తుఫానుతో పంటలు నష్టపోయిన రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని రైతులకు న్యాయం చేయాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. కాగా.. హరీష్ రావుతో పాటు పత్తియార్డును బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకర్ రావు, మధుసూదనాచారి, చల్లా ధర్మారెడ్డి, మాలోత్ కవిత పరిశీలించారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు నుంచి కాంట దాకా అన్నీ సమస్యలేనని ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సమయానికి ఎరువులందవు, కరెంటు సరిగ్గా రాదు, రైతుబంధు రాదు, రుణమాఫీ లేదు, బోనస్, పంటల బీమా ఊసేలేదని మండిపడ్డారు. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పిన ఒక్క హామీ అయిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లు, కార్పొరేట్లకు లాభం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి మేలుకోకపోతే తెల్ల బంగారం పత్తిని తెచ్చి జూబ్లీహిల్స్ ప్యాలెస్ ముందు పోస్తామని హెచ్చరించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందన్నారు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ని సందర్శించాక పత్తి రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. రాష్ట్రంలో పత్తి రైతులు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. తెలంగాణలో 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల, బీజేపీ తప్పుడు విధానాల వల్ల పత్తి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. సీసీఐ తుగ్లక్ వంటి పిచ్చి నిర్ణయాలు తీసుకొని రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ మిల్లులన్నీ రెండు రోజులుగా మూతపడ్డాయి. పత్తి రైతులంతా అయోమయంలో ఉన్నారు. ఈరోజు రైతులకు పత్తిని అమ్ముకోవడానికి అవకాశం లేక అడ్డగోలుగా దళారులకు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. పత్తికి మద్దతు ధర రూ. 8,100. కానీ, రూ.6 వేలకే రైతులు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. క్వింటాల్ మీద రూ.2000ల చొప్పున పత్తి రైతులు నష్టపోతున్నారు. మాటల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరచేతిలో వైకుంఠం చూపించి, చేతల్లో నరకం చూపిస్తున్నాయని అన్నారు. వరదలు, తుఫాన్‌ల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతే తుగ్లక్ నిర్ణయాలతో మరింత ఇబ్బంది పెట్టడం సరికాదు. ఒకవైపు అకాల వర్షాలతో పంట దిగుబడి తగ్గిపోయింది. పంట చేనులన్నీ దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడులు రాక రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చింది. ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. 8 నుంచి 12 శాతం తేమ విధానాన్ని సవరించి, కపాస్ యాప్ ని రద్దు చేయండి. స్మార్ట్ ఫోన్లు లేకపోవడం వల్ల కపాస్ యాప్‌లో నమోదు చేయడం రైతులకు కష్టమైన పని. గత సంవత్సరం లాగానే 12 క్వింటాల పత్తి కొనాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. బీజేపీ ఎంపీలు ఒక్కసారి కూడా నోరు విప్పరు. రైతుల గురించి కేంద్ర ప్రభుత్వాన్ని అడగరు. కేసీఆర్‌ని, బీఆర్ఎస్‌ని తిట్టడం తప్ప బీజేపీ ఎంపీలకు మరో పని చాతకాదు. కాంగ్రెస్ ప్రశ్నించదు. బీజేపీ అడగదు అంటూ మండిపడ్డారు. రైతులను తీవ్రంగా ఇబ్బందులు పెట్టినందుకు విజయోత్సవాలు చేస్తున్నారా?. యూరియా బస్తాల కోసం రైతులను లైన్‌లో నిల్చోపెట్టినందుకు విజయోత్సవాలా?. ములుగు నియోజకవర్గంలో చింతకుంట, మంగపేట మండలాల నుంచి వచ్చిన రైతు వెంకటేశ్వర్లు, రైతు లక్ష్మయ్య మక్కలు అమ్మడానికి ఎనుమాముల మార్కెట్‌కి వచ్చారు. క్వింటల్ మక్కలు రూ.1800 కు రైతులు అమ్ముతున్నారు, రూ.2400 మక్కకు మద్దతు ధర. మక్క రైతులు ఒక క్వింటాలకు రూ.570 నష్టపోతున్నారు. ఎవరికైనా మక్క రైతులకు పైసలు విడుదల చేశారా అని మార్క్ ఫెడ్ అధికారులను అడిగితే.. రాష్ట్ర ప్రభుత్వం ఒక రూపాయి కూడా విడుదల చేయలేదని సమాధానం ఇచ్చారు. పోయిన యాసంగిలో రైతులకు రావలసిన రూ.1,100 కోట్ల బోనస్‌ని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు.



## తుదిదశకు శాసనమండలి మరమ్మతు పనులు

**పనులు పరిశీలించి సూచనలు చేసిన సిఎం రేవంత్**

**హైదరాబాద్, నవంబర్ 18 :** శాసనమండలి భవనం పనులు చివరిదశకు చేరాయి. పాత శాసనసభ భవనాన్ని అందంగా తీర్చి ముస్తాబు చేస్తున్నారు. దీంట్లో మండలి కార్యకలాలపు జరుగనున్నాయి. దీంతో రెండు సభలు ఒకే ప్రాంగణంలోకి అందుబాటులోకి రానున్నాయి. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి అసెంబ్లీ ఆవరణలోని శాసన మండలి మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. పనులను సమీక్షించిన సిఎం పలు సూచనలు చేశారు. తుదిదశకు చేరుకున్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు మండలిని జూబ్లీహాల్‌లో నిర్వహిస్తున్నారు. దీంతో మండలికి వెళ్లాలంటే మంత్రులకు ఇబ్బందికరంగా మారింది. అలాగే ఏదైనా సమావేశం నిర్వహించేందుకు గతంలో జూబ్లీహాల్‌ను ఉపయోగించేవారు. తిరిగి దానిని పాతపద్ధతిలో పునరుద్ధరించే అవకాశాలు ఉన్నాయి. అసెంబ్లీ కార్యదర్శ నరసింహాచార్యులు పలువురు అధికారులు కూడా స్పీకర్ వెంట వచ్చారు.



## కామన్‌వెల్త్ లర్నింగ్‌తో ఓపెన్ వర్సిటీ ఒప్పందం

**సిఎం రేవంత్ సమక్షంలో కుదిరిన అవగాహన**

**హైదరాబాద్, నవంబర్ 18 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమి ఏర్పాటుకు కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ తో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవగాహన ఒప్పందంతో ప్రముఖ డిజిటల్ విశ్వవిద్యాలయంగా ఓపెన్ వర్సిటీ అభివృద్ధి చెందనున్నది. బోధన, అభ్యాసం, పరిశోధనలను మెరుగుపరచడానికి అత్యాధునిక డిజిటల్ హబ్‌గా పనిచేస్తుంది. టెక్నాలజీ ద్వారా నాణ్యమైన విద్యను అందించనున్నది. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలను బలోపేతం చేయడంతో పాటు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఒక నాలెడ్జ్ హబ్ గా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ మేరకు దాని సిఇవో అధ్యక్షుడు పీటర్ స్కాట్ కు ముఖ్యమంత్రి వివరించారు. ఈ సమావేశంలో కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు పీటర్ స్కాట్, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, వైస్ చాన్స లర్ ఘంటా చక్రపాణి, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌ఘడ్‌లో నిర్బంధంతో ఏపీలోకి మావోలు

- ముందస్తు సమాచారంతోనే కూంబింగ్
- అదే క్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా హతం
- అల్లూరు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ వెల్లడి

**పాడేరు, నవంబర్ 18 :** ఛత్తీస్‌ఘడ్‌లో నిర్బంధం, దాడులు పెరగడంతోనే మావోలు ఏపీ వైపు వచ్చారని, అలా ఇక్కడ ఎన్‌కౌంటర్‌కు గురయ్యారని అల్లూరు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాతోపాటు పలువురు మావోయిస్టులు మృతి చెందారని అల్లూరు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులపై పోలీసులు ఉక్కుపాదం మోపటం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లి అటవీ ప్రాంతానికి వారు చేరుకున్నారన్నారు. మావోయిస్టుల ఉద్యమాలకు ప్రజాదరణ లేదని పేర్కొన్నారు. జనజీవనస్రవంతిలోకి రావాలంటూ ఈ సందర్భంగా మావోయిస్టులకు ఆయన పిలుపు నిచ్చారు. మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు. ఇప్పటికే మృతి చెందిన మావోయిస్టుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని చెప్పారు. మంగళవారం ఉదయం 6.30 నుంచి 7.30 గంటల మధ్య ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్ వివరాలను జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్.. వివరించారు. మరో ఐదుగురు మావోయిస్టులు ఘటనా స్థలం నుంచి తప్పించుకున్నారన్నారు. వారి కోసం కూంబింగ్ కొనసాగుతోందని చెప్పారు. మరణించిన మావోయిస్టు అగ్రనేత హిడ్మా 28 హింసాత్మక సంఘటనల్లో పాల్గొన్నారని వివరించారు. అతడిపై అనేక రివార్డులు ఉన్నాయని గుర్తు చేశారు. హిడ్మా కదలికలపై గత మూడు వారాలు నుంచే సమాచారం ఉందన్నారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత హిడ్మాతోపాటు అతడి అనుచరులు మరణించారని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి ధృవీకరించారు. మంగళవారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మావోయిస్టుల కోసం కూంబింగ్ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. అలాగే మావోయిస్టుల కదిలకపై నిఘా ఉంటుందని తెలిపారు. మావోయిస్టులపై ఇతర రాష్ట్రాల్లో పోలీస్ నిఘా అధికంగా ఉండడంతో ఆగ్రనేతలంతా ఏవోబీలోకి ప్రవేశిస్తున్నారని వివరించారు. విశాఖ రేంజ్‌లో మావోయిస్టులకు ఆశ్రమ పొందేందుకు చోటు లేదన్నారు. భవిష్యత్తు ముందని..గంజాయి వద్దని యువత ఆయన సూచించారు. గంజాయి నిర్మూలనలో భాగంగా చైతన్యం కల్పించడం కోసం అభ్యుదయ సైకిల్ యాత్ర చేపట్టామని డీఐజీ స్పష్టం చేశారు.

## ఐబొమ్మ రవిని ఎన్‌కౌంటర్ చేయాలి

**నిర్మాత సి కళ్యాణ్ సంచలన వ్యాఖ్య**

**హైదరాబాద్, నవంబర్ 18 :** మూవీ పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు రవిని ఎన్ కౌంటర్ చేయాలని ప్రముఖ నిర్మాత సీ.కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం తెలుగు ఫిలిం ఛాంబర్ మీడియా సమావేశం నిర్వహించింది. మూవీ పైరసీకి పాల్పడుతోన్న ఐబొమ్మ రవిని అరెస్ట్ చేసినందుకు ప్రభుత్వానికి థ్యాంక్స్ చెప్పారు ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులు. అనంతరం ఛాంబర్ ప్రతినిధులు మూవీ పైరసీపై మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్మాత సీ. కల్యాణ్ మాట్లాడుతూ.. కోట్లు పెట్టి సినిమా తీస్తే పైరసీ చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైరసీతో మూవీ ఇండస్ట్రీకి వేల కోట్ల నష్టం వాటిల్లేలా చేసిన రవిని అరెస్ట్ చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నిర్మాత చదలవాడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలోనే అత్యుత్తమంగా తెలంగాణ పోలీస్ వ్యవస్థ పనిచేస్తుందని ప్రశంసించారు. ఐబొమ్మ సైట్ నిర్వాహకుడు రవిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు చాలా కష్టపడ్డారని కొనియాడారు. బడ్జె పెంచి సినిమా టికెట్ రేట్లు భారీగా పెంచుతున్నారని.. ఇది తప్పన్నారు. బ్జడెట్‌లో 90 శాతం ఆర్టిస్టులకి ఇస్తున్నారని.. ఆ భారం ప్రేక్షకుల మీద పడుతుందని అన్నారు. చిత్ర పరిశ్రమకు పెను సవాలుగా మారిన 'ఐబొమ్మ' పైరసీ వెబ్‌సైట్ కింగ్‌పిన్ ఇమ్మడి రవి అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. దమ్ముంటే నన్ను పట్టుకోండి అంటూ పోలీసులకే సవాల్ విసిరిన రవిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. విదేశాల నుంచి హైదరాబాద్ వచ్చిన రవిని కూకట్‌పల్లిలో అదుపులోకి తీసుకుని కటకటాల్లోకి నెట్టారు.

## బస్సు యజమానులుగా మహిళలు

**ఆర్థిక శక్తికి చోదకంగా పథకం**

**హైదరాబాద్, నవంబర్ 18 :** తెలంగాణలోని రేవంత్ రెడ్డి సర్కార్ గ్రామీణ మహిళల సాధికారత కోసం మరో అద్భుతమైన స్కీమ్ ప్రవేశపెట్టింది. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ కింద, మహిళల స్వయం సహాయక బృందాలకు మొత్తం 600 బస్సులు అందించనుంది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళలు బస్సుల యజమానులుగా మారి, స్థిరమైన ఆదాయాన్ని సంపాదించే అవకాశం లభిస్తుంది. వారిని బస్సులకు యజమానులు చేయడం ద్వారా ఆర్థికాభివృద్ధి కలుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇది మహిళల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని బలోపేతం చేస్తూ, గ్రామీణ పేదరిక నిర్మూలనకు కీలకంగా నిలవనుందన్నారు. ఈ స్కీమ్ ప్రకారం, ఒక్కో బస్సు ధర సుమారు రూ.36 లక్షలు. మహిళా బృందాలు రూ.6 లక్షలు ఇన్వెస్ట్ చేస్తాయి. మిగిలిన మొత్తాన్ని కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ద్వారా ప్రభుత్వం అందిస్తుంది. బస్సులు మహిళల యాజమాన్యంలో ఉంటాయి. కానీ, ఈ బస్సులను తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ నడిపిస్తుంది. ప్రతి బస్సుకు నెలకు రూ.69,648 చెల్లిస్తుంది. ఇందులో రూ.19,648 ఆపరేషనల్ ఖర్చులకు, మిగిలినది లోన్ తిరిగి చెల్లింపునకు వాడతారు. ఇలా 7 సంవత్సరాలపాటు రిస్క్ లేకుండా స్థిర ఆదాయం లభిస్తుంది. కార్యక్రమం దశలవారీగా అమలవుతోంది. మొదటి దశలో 17 జిల్లాల్లో 151 మహిళా బృందాలు 151 బస్సులు పొందాయి. రెండో దశలో మిగిలిన 449 బస్సులు కొనుగోలు చేస్తారు. ఈ బస్సులు తెలంగాణలో అమలవుతున్న మహాలక్ష్మి స్కీమ్ కింద ఉచిత ప్రయాణాలకు సహాయపడతాయి. గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని బస్సులు అందేలా చేస్తాయి. ఇది ప్రైవేట్ బస్సులపై ఆధారపడకుండా, మహిళల యాజమాన్య బస్సులపై ఆధారపడేలా మార్చుతుంది. ప్రభుత్వం ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా రూ.5 కోట్లు కేటాయించింది.

## ఆపరేషన్ కగార్ విజయవంతం అయినట్లే

- అంతర్గత కలహాలతోనే మావోయిస్ట్ పార్టీ పతనం
- గిరిజనుల సమస్యలపై పోరాటాలు ఆపలేం
- ప్రొఫెసర్ హరగోపాల్ వ్యాఖ్య



**హైదరాబాద్, నవంబర్ 18 :** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ సక్సెస్ అయినట్లే భావిస్తున్నామని పౌర హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్ తెలిపారు. అగ్రనాయకులంతా హతం కావడం, ఉన్నవారు లొంగిపోవడం, మావోలకు ప్రజల్లో మద్దతు కరువవ్వడం వంటి కారణాలతో వారి ఉనికి ప్రమాదంలో పడిందన్నారు. ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాతోపాటు మరో ఐదుగురు మావోయిస్టులు మరణించారు. ఈ ఘటనపై ప్రొ. హరగోపాల్ హైదరాబాద్‌లో స్పందించారు. 25 ఏళ్ల క్రితం ఉన్న పరిస్థితులు ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో లేవన్నారు. అలాగే ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో వారికి మద్దతు లేదని చెప్పారు. మావోయిస్టు పార్టీ పూర్తిగా అంతమైనా ఆదివాసీల ఉద్యమాలు మాత్రం ఆగవని ప్రొ.హరగోపాల్ కుండబద్దలు కొట్టారు. పార్టీలోని భిన్నాభి ప్రాయాలు, విభేదాల వల్లే మావోయిస్టు పార్టీకి ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన అభిప్రాయపడ్డారు. ÷ాజ్యంలోని మార్పులు, ప్రజల్లో మావోయిస్టు పార్టీకి సపోర్ట్ లేక పోవడం కూడా ఒక కారణమని ప్రొ. హరగోపాల్ స్పష్టం చేశారు. మావోయిస్టుల్లో చీలికలు, విభేదాలు, అభిప్రాయ బేధాలు వలన మావోయిస్టు పార్టీ క్షీణించిందని చెప్పారు. కేంద్ర కమిటీ నేతలు.. ప్రభుత్వం ఎదుట లొంగుబాటుకు వారి వారి వ్యక్తిగత అభిప్రాయాలు,కారణాలు ఉన్నాయని ఆయన విశ్లేషించారు. మూడు రాష్ట్రాల పోలీసుల తోపాటు, కేంద్ర ప్రభుత్వం సైతం హిడ్మాపై ఫోకస్ పెట్టిందన్నారు. హిడ్మా అనే వ్యక్తి మావోయిస్టు పార్టీలో చాలా బలమైన నాయకుడని అభివర్ణించారు. పార్టీ కోసం ఏదైనా చేయగలిగిన సామర్థ్యం ఉన్న వ్యక్తి హిడ్మా అని ప్రొ.హరగోపాల్ స్పష్టం చేశారు. ఏదైనా లక్ష్యం నిర్దేశిస్తే పూర్తి చేయగలడనే ఒక బలమైన నమ్మకం హిడ్మాపై పార్టీలో బలంగా ఉందని తెలిపారు. ప్రభుత్వాలు టెక్నాలజీ, ఆయుధాలు, డ్రోన్లతో అటవీ ప్రాంతాలను జల్లెడ పడుతున్నాయన్నారు. వాటిని మావోయిస్టు పార్టీ తట్టుకోలేక పోయిందని వివరించారు. మార్చి మాసాంతానికి దేశంలో మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించాలని కేంద్రం నిర్ణయించింది. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు ప్రాబల్యం ఉన్న ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్, తెలంగాణ తదితర రాష్టాల్లో భద్రతా బలగాలతో జల్లెడ పడుతోంది. దీంతో వివిధ సందర్భాల్లో జరిగిన పలు ఎన్‌కౌంటర్లలలో వేలాది మంది మావోయిస్టులు మరణించారు. పలువురు అగ్రనేతలు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. అలాగే వందలాది మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా ఏపీలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం పదుల సంఖ్యలో మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్య ప్రాంతాలకు తరలించి విచారిస్తున్నారు.

## టి సాట్ ద్వారా పోటీ పరీక్షలకు అవసరమైన కంటెంట్

- టి-సాట్ నెట్వర్క్ కంటెంట్ అన్ని స్థాయిల్లో ఉపయోగం
- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, నవంబర్ 18 :** పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు నాణ్యమైన కంటెంట్ అందిస్తున్న టి- సాట్ ను రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభినందించారు. ఉపాధ్యాయ ఉద్యోగ పరీక్ష డీఎస్సీకి టెట్ అర్హత తప్పనిసరి కావడంతో అభ్యర్థులందరూ టి-సాట్ డిజిటల్ కంటెంట్ ద్వార సంసిద్ధులు కావాలని సూచించారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఉపాధ్యాయ అర్హత పరీక్షలను ప్రతీ ఏటా రెండు సీజన్లలో నిర్వహిస్తుండగా నిత్యం అందుబాటులో ఉండే టి-సాట్ నెట్వర్క్ కంటెంట్ అన్ని స్థాయిల్లో అభ్యర్థులకు ఉపయోగ పడుతుందని మంత్రి గుర్తుచేశారు. టి-సాట్ టీజీ టెట్-2026 డిజిటల్ కోచింగ్ పోస్టర్ ను సచివాలయంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల కాలంలో మూడు టెట్ పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం, 2026 జనవరి నెలలో నిర్వహించే టెట్-2026 పరీక్ష కోసం టి-సాట్ నెట్వర్క్ స్పెషల్ డిజిటల్ కంటెంట్ అందిస్తోందని టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి విద్యాశాఖకు మెరుగైన వసతుల్ని కల్పిస్తున్నారని, 11వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు రికార్డు కాలంలో పూర్తి చేసారన్నారు. కేంద్ర గైడ్ లైన్స్ ప్రకారం టెట్ అర్హత ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడికీ తప్పనిసరి అయిన నేపథ్యంలో టెట్ కు హాజరయ్యే అభ్యర్థులతో పాటు ఉపాధ్యాయుల కోసం సైతం ప్రత్యేక కంటెంట్ అందిస్తున్నామని సీఈవో బోధనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన పరీక్షల తేదీలను అనుసరించి టెట్ పరీక్షలకు నవంబర్ 18,19వ తేదీలు మంగళ, బుధవారాల్లో లైవ్ ఓరియంటేషన్ తో పాటు మరో 44 రోజులు 200 ఎపిసోడ్స్ ప్రసారం చేయనున్నట్లు సీఈవో తెలిపారు. టి-సాట్ నిపుణ ఛానల్ లో సాయంత్రం 5గంటల నుండి ఏడు గంటల వరకు, విద్య ఛానల్లో ఉదయం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు ప్రతి రోజు నాలుగు గంటల పాటు ప్రత్యేక ప్రసారాలుంటాయని సీఈవో ప్రకటించారు. టీచర్స్ ఎలిజబిలిటీ టెస్ట్ కు అవసరమైన స్జబెక్టులు చైల్డ్ డెవలప్మెంట్, సైకాలజీ, పిజికల్, బయాలాజికల్ సైన్స్, మాథ్స్, సోషల్ స్టడీస్ తో పాటు ఇంగ్లీష్, తెలుగు ఇతర స్జబెక్టులకు సంబంధించిన డిజిటల్ లెసన్స్ ప్రసారమౌతాయన్నారు. టెట్ పేపర్-1, 2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు టి-సాట్ అందించే ప్రసారాలను సద్వినియోగం చేసుకోవాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి కోరారు. టెట్ అర్హత పరీక్ష కోసం టి-సాట్ నెట్వర్క్ ప్రసారం చేసే ప్రత్యేక కంటెంట్ టి-సాట్ శాటిలైట్ ఛానళ్లతో పాటు, టి-సాట్ యాప్, యూట్యూట్ లో అందుబాటులో ఉంటాయన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టి-సాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాధిక్ పాల్గొన్నారు.

# భారత్‌కు తలనొప్పిగా బంగ్లా పరిణామాలు!



**ఏదేశాన్ని తిన్నగా బతకనీయకుండా ఆటలాడడం అమెరికాకు అలవాటుగా మారింది. అన్ని దేశాలపైనా ఆంక్షలు విధించడం, మోయలేని సుంకాలు విధించడం, బెదిరించడం పరిపాటిగా మారింది. తాజాగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే, 500 శాతం పన్నులు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిం చారు. ప్రపంచ దేశాలన్నీ తన కనుసన్నల్లో ఉండాలన్న కోరిక అమెరికాలో బలంగా నాటుకుంటోంది. అందుకు అవసరమైన అన్ని కుయుక్తులు పన్నుతోంది. ఒక్కో దేశంలో వేలుపెడుతూ వాటిని కంట్రోల్ చేస్తోంది. ఇజ్రాయిల్‌ను అడ్డం పెట్టుకుని పాలస్తీనాపై దాడికి తెగించింది. ఇరాన్, ఖతార్‌లపైనా విరుచుకు పడింది. అలాంటి అవకాశం లేని చోట్ల రాజకీయంగా వేలుపెట్టి అక్కడున్న పాలకులను మార్చేస్తోంది. ఒక్క భారత్‌లోనే అది సాధ్యం కావడం లేదు. చైనాలో అస్సలు సాధ్యం కాదు.**

భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం కావడం, విభిన్న మతాలు, కులాల సమాహారం కావడంతో ఇక్కడ దాని పప్పులు ఉడకలేదు. ఇక్కడా రకరకాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇటీవలి వరుస ఆందోళనలు చూస్తుంటే సిఐఎ బాగా పని చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి. మన పక్కనే ఉన్న బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వాన్ని గద్దె దించడంలో పరోక్షంగా అమెరికా పాత్ర ఉంది. అలాగే పాక్‌ను మరోమారు దువ్వుతున్నారు. నేపాల్‌లో గొడవలు సృష్టించారు. భారత్‌ను దెబ్బతీసేందుకు చుట్టుపక్కల దేశాల్లో అలజడులు సృష్టిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై ఆంక్షలు విధించారు. వీసాల విషయంలో అనేక రకాల నిబంధలను పెట్టారు. బంగ్లాదేశ్‌నే తీసుకుంటే అక్కడా అలజడుల వెనక అమెరికా హస్తం ఉందని అంతర్జాతీయ నిపుణులు ఆరోపిస్తున్నారు. ఇతరదేశాల్లో వేలు పెట్టడం వల్ల తాము చాలా నష్టపోయామని అమెరికా ఇంటిలిజెన్స్ చీఫ్ తులసీగబ్బార్ ఆమధ్య అంగీకరించారు. అయినా వెనకటి గుణమేల మారు అన్న చందంగా అమెరికా పరిస్థితి ఉంది. బంగాదేశ్‌లనే తీసుకుంటే అక్కడ హసీనాను గద్దె దించడం, యూనస్‌ను గద్దెనెక్కించడం చకచకా జరిగి పోయాయి. ఇప్పుడు హసీనాకు ఉరిశిక్షను కూడా విధించారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం రసాయన ఆయుధాల పేరుతో ఇరాక్‌పై దాడిచేసి అక్కడ సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని అమెరికా గద్దె దింపింది. అలాగే సద్దాంను విచారణ పేరుతో బంధించి ఉరితీసే వరకు నిద్రపోలేదు. సరిగ్గా ఇప్పుడు బంగ్లాదేశ్‌లో జరుగుతున్న తీరు కూడా ఇరాక్‌ను పోలివుంది. హసీనా భారత్‌కు అనుకూలంగా ఉండడాన్ని అమెరికా జీర్ణించుకోవడం లేదని అర్థం అవుతోంది. అందుకే ఆమెను పదవీచ్యుతురాలిని చేశాక భారత్‌లో ఆశ్రయం పొందారు. ఇప్పుడు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మరణశిక్షకు అర్హురాలని అక్కడి ట్రిబ్యునల్ నిర్ణయించింది. ముగ్గురు సభ్యుల ఈ ట్రిబ్యునల్ హసీనా ఎన్నో దుర్మార్గాలకు పాల్పడిందని ఏకరువు పెట్టింది. తనకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్నవారిని కాల్చిపారేయమని ఆమె ఆదేశించారని, డ్రోన్లు, హెలికాప్టర్లు ఉపయోగించి మరీ నిరసనకారులపై మారణాయుధాలతో విరుచుకుపడమని భద్రతాబలగాలను ఒత్తిడిచేశారని న్యాయమూర్తులు తేల్చారు. అధికారంలో కొనసాగడానికి అత్యంత అమానుషంగా ప్రవర్తించా రంటూ, తీవ్రంగా గాయపడిన నిరసనకారులను సకాలంలో ఆస్పత్రికి తరలించడానికి కూడా భద్రతాదళాలు నిరాకరించాయని న్యాయమూర్తులు ప్రకటించారు. తీర్పు ఇవ్వడంలో జాప్యం జరిగినందుకు క్షమించమని కూడా ఒక న్యాయమూర్తి అన్నారు. తీర్పు వెలువడగానే, యూనిస్ ప్రభుత్వం హసీనాను తమకు అప్పగించమని డిమాండ్ చేయడం చూస్తూనే ఉన్నాం. ట్రిబ్యునల్ తీర్పు ఎలా రాబోతున్నదో ఊహకు అందనిదేమీ కాదు.

సరిగ్గా యాభైయేళ్ళక్రితం జరిగిన సైనిక కుట్రలో తండ్రి, తల్లి, ముగ్గురు సోదరులను కోల్పోయి, ఆరేళ్ళపాటు భారత్‌లో ఇందిర నీడన తలదాచుకొని, తిరిగి స్వదేశంలో కాలూని అధికారాన్ని చేజిక్కించుకున్న హసీనా గతం ఇప్పుడు అందరికీ గుర్తుకువస్తోంది. జియావుర్ రహ్మాన్ భార్య ఖలీదాజియామీద అలుపెరగని, సాహసోపేత పోరాటాలు చేశారు. ఇద్దరు బేగంల మధ్య సాగిన ఆధిపత్య పోరాటంలో ముజబూర్ రహ్మాన్ కుమార్తె పైచేయి సాధించారు. ఖలీదా సహా బీఎన్పీ అధినాయకుల నిర్బంధాలు, ఆ పార్టీకి అండగా ఉన్న జమాతే వంటే ఇస్లామిక్ ఛాందసశక్తులను అధికారికంగానూ, అనధికారికగానూ హసీనా చీల్చిచెండాడారు. హసీనా పాలనలో బంగ్లాదేశ్ వేగంగా వృద్ధిచెందింది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తయ్యాయి, పేదరిక నిర్మూలనలోనూ మంచిపేరు తెచ్చుకుంది. తనకు వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమంపట్ల హసీనా నిర్దయగా వ్యవహరించారన్నదీ వాస్తవమే. ఆ తరువాత ఆమె దిగివచ్చినా, అప్పటికే పరిస్థితి చేజారింది. రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం తన లక్ష్యాన్ని సాధించు కున్న తరువాత నిజానికి చల్లారినా, స్వల్పకాలంలోనే తిరిగి రాజుకోవడం వెనుక జమాత్ ఇస్లామీ, బీఎన్పీ ఉండటంతో ఆమె కఠినంగా వ్యవహరించాల్సి వచ్చిందని అంటారు. పాకిస్థాన్ ఒత్తిడి కారణంగా అమెరికా, దాని మిత్రదేశాలు కొన్ని ఆమెకు పూర్తి వ్యతిరేకంగా వ్యహరించాయి. ఆమె ఢిల్లీ పారిపోయి వచ్చిన తరువాత, బంగ్లాదేశ్‌లో అప్పటినుంచి ఇప్పటివరకూ సాగిన పరిణామాలన్నీ ఆమె పట్ల ఏయే శక్తులు ఏ లక్ష్యాల సాధనకోసం కత్తికట్టాయో తెలియచెబుతాయి. గృహనిర్బంధంలో ఉన్న ఖలీదా విదేశీ చికిత్సతో ఎన్నికలకు సిద్ధపడటం, వేలాదిమంది జమాత్ యోధులు జైళ్ళ నుంచి బయటకు రావడం, ముజబూర్ రహ్మాన్ విగ్రహాలను మాత్రమే కాదు, ఆయన ఆధ్వర్యంలో సాగిన విముక్తి పోరాటాన్ని సైతం చరిత్ర నుంచి చెరిపేసి, అప్పట్లో ఊచకోతకోసిన పాకిస్థాన్‌ను ఘనంగా ఊరేగించడం చూస్తూనే ఉన్నాం. ఓ రకంగా పాకిస్థాన్ ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిది. ఇలా భారత్‌కు వ్యతిరేకంగా పాక్‌ను, బంగ్లాదేశ్‌ను ఎగదోయడం వెనక ఎవరున్నారన్నది వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఇప్పటికే పలుమార్లు ఆమె అప్పగిం చాలని యూనిస్ ప్రభుత్వం కోరుతూ వచ్చింది. ఇప్పుడు ఉరిశిక్ష విధించారు. కనుక భారత్ మీద ఒత్తిడి పెంచేందుకు ఇప్పుడు మరో ఆయుధం చేతికి అందివచ్చింది. ఇదంతా పెద్దన్న ఆడిస్తున్న నాటకమని తెలుసుకోవడానికి పెద్దగా తెలివి తేటలు అక్కర్లేదు.

# మావోయిస్టు అగ్రనేత హిడ్మా హతం

**మారేడుమిల్లిలో ఎన్‌కౌంటర్..**
**ఎదురుకాల్పుల్లో మొత్తం ఆరుగురు మావోల హతం**

**మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ**





**మారేడుమిల్లి, నవంబర్ 18 :** మావోయిస్ట్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే అనేకమంది లొగిపోగా, పలువురు అగ్రేతలు పోలీస్ తూటాలకు బలయ్యారు. తాజాగా మరో అగ్రనేత హిడ్మా సైతం నేలకొరిగాడు. వచ్చే మార్చి లోగా నక్సల్స్‌ను అంతం చేస్తామన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటనకు అనుగుణంగా ఆపరేషన్ కగార్‌తో బలగాలు దూసుకు పోతున్నాయి. తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు -మావోయిస్టుల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా, ఆయన భార్య రాజే, అనుచరులు మల్లా, దేవే, చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్ ఉన్నారు. హిడ్మాపై కోటి, ఆయన భార్యపై 50 లక్షల రివార్డు ఉన్నాయి. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఆ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం నేపథ్యంలో కూంబింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూర్వాటి గ్రామంలో జన్మించిన మద్వి హిడ్మా.. బస్తర్ ప్రాంతంలో దళంలో కీలక సభ్యుడిగా ఎదిగారు. చిన్నవయసులోనే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడయ్యారు. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరుపొందారు. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ పనిచేశారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలోనూ ఎదురుకాల్పులు జరిగాయి. మంగళవారం ఉదయం ఎర్రబోరు ప్రాంతంలో మావోయిస్టులు-భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందాడు. ఆ ప్రాంతంలో ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. ఈ క్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత మద్వి హిడ్మా మృతి చెందారు. హిడ్మాతో పాటు ఆయన భార్య, అనుచరులతో కలిపి మొత్తం ఆరుగురు ఈ ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. హిడ్మా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పర్వతి గ్రామానికి చెందిన స్థానిక మూరియా తెగకు చెందిన వ్యక్తి . 1981వ సంవత్సరంలో జన్మించిన హిడ్మా 10వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నాడు. 2000 ప్రారంభంలో మావోయిస్ట్ ఉద్యమంలో చేరి, క్రమంగా అగ్రస్థానానికి ఎదిగాడు. ప్రస్తుతం సీపీఐ (మావోయిస్ట్), పీఎల్‌జీఏ బెటాలియన్ 1 కమాండర్‌గా దండకారణ్య ప్రాంతంలో (ఛత్తీస్‌గఢ్, బీజాపూర్, దంతేవాడ ప్రాంతాలు) పనిచేస్తున్నాడు. 2010లో జరిగిన దంతేవాడ దాడి (76 సీర్పీఎఫ్ సిబ్బంది హతం), 2013 జీరామ్ ఘాటి నరమేధం వంటి పలు పెద్ద దాడుల్లో ప్రధాన సూత్రధారి హిడ్మా అని ఆరోపణలు ఉన్నాయి. ఏడాది హిడ్మా సీపీఐ (మావోయిస్ట్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటరీగా పదోన్నతి పొందినట్లు పోలీసుల వద్ద సమాచారం ఉంది. హిడ్మాను పట్టుకోవడం కోసం పోలీసులు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అతడి ఆచూకీ తెలిపిన వారికి బహుమతులు కూడా ప్రకటించారు. అడవుల భౌగోళిక పరిజ్ఞానం, గెరిల్లా యుద్ధ వ్యూహాలు, స్థానిక నెట్‌వర్క్‌లను ఉపయోగించడంలో హిడ్మా సిద్ధహస్తుడు. దీంతో అతడిని భద్రతా దళాలు చాలా కాలం పట్టుకోలేకపోయాయి 2004 నుంచి ఇప్పటివరకు అతను 20కి పైగా ప్రధాన దాడుల్లో పాల్గొన్నట్లు భద్రతా సంస్థలు అంచనా వేస్తున్నాయి. వేలాది మంది సిబ్బందితో పెద్ద ఎత్తున చేపట్టిన ఆపరేషన్లు కూడా హిడ్మాను పట్టుకోలేకపోయాయి. ఎట్టకేలకు మారేడుమిల్లి అటవీ ప్రాంతాల్లో హిడ్మా, అతడి అనుచరులు షెల్టర్ తీసుకున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు చిక్కింది. భద్రతా బలగాలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో హిడ్మాతో సహా ఆరుగురు మరణించినట్టు పోలీసులు తెలిపారు.

# తుమ్మల లాంటి నేతలను వదులుకోవడం తప్పే

- అందుకే బిఆర్ఎస్ మూడోసారి మట్టి కరిచింది
- తెలంగాణలో ప్రతిపక్షం అన్నింటా ఫెయిల్
- ఇప్పుడా బాధ్యతను జాగృతి పోషిస్తుంది
- ఖమ్మంలో మీడియాతో కవిత సంచలన వ్యాఖ్యలు



**ఖమ్మం, నవంబర్ 18 :** రాష్ట్రంలో అధికార పక్షం, ప్రతిపక్షం బాధ్యతగా వ్యవహరించటంలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన బలమైన నేత తుమ్మల నాగేశ్వరావును బీఆర్ఎస్ వదులుకోవడంతోనే మూడోసారి అధికారంలోకి రాకుండా పోయిందంటూ వ్యాఖ్యలు చేశారు. తుమ్మల బయటకు వెళ్లడంతోనే రాష్ట్రంలో గులాబీ పార్టీ పరిస్థితి తలకిందులైందన్నారు. తుమ్మల లాంటి నేతను బీఆర్ఎస్ వదులుకోవడం నూటికి నూరు శాతం పెద్ద తప్పే అని అన్నారు. తెలంగాణలో ప్రతిపక్షం ఫెయిల్ అయ్యిందని.. తన బాధ్యతను నిర్వర్తించలేకపోతోందని వ్యాఖ్యలు చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను భవిష్యత్తులో తాము పోషించబోతున్నామన్నారు. కొత్త రాజకీయ పార్టీ గురించి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. తనను ఏ విధంగా పార్టీ నుంచి బయటకు పంపారనే విషయాన్ని తెలియజేశారు. రాజకీయ పార్టీ గురించి ఇప్పుడప్పుడే ఆలోచన చేయటం లేదని కవిత అన్నారు. బీఆర్ఎస్‌లో నుంచి తనను సస్పెండ్ చేశారని.. ఆ పార్టీతో తనకెటువంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు. కుట్రతో బీఆర్ఎస్ నుంచి తనను బయటికి పంపించారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది కుట్ర చేసి తనను.. తన కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీకి దూరం చేశారన్నారు. తన జీవితంలో చిన్న పొరపాటు కూడా చేయలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు తనకు ఎక్కడా ఎటువంటి అవకాశం ఇవ్వలేదని.. కనీసం ఒక టీచర్ పోస్ట్ కూడా ట్రాన్స్ఫర్ చేయించుకోలేకపోయానని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌లో జాగృతి కార్యకర్తలకు అన్యాయం చేశారని... కనీస గుర్తింపు ఇవ్వలేదని కవిత సంచలన కామెంట్స్ చేశారు. కవిత ఇంకా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులు ఊదిన జిల్లా ఖమ్మం జిల్లా అని జాగృతి అధ్యక్షురాలు అన్నారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఖమ్మం జిల్లా పూర్తిగా మారిపోయిందని గుర్తుచేశారు. వెంగళరావు హయాంలో జిల్లా విశేషంగా అభివృద్ధి చెందిందన్నారు. ఆ తరువాత పెద్దలు తుమ్మల నాగేశ్వరావు ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. ఖమ్మం అభివృద్ధి కోసం ఎవరి ప్రయత్నం వారు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందలేదని అన్నారు. ఇంకా ఖమ్మం అభివృద్ధి చెందాల్సి ఉందని.. సీతారామ ప్రాజెక్టును కూడా వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక తెలంగాణ రావాలన్నదే తన ఆశయమని.. అవకాశం, అధికారం, ఆత్మగౌరవం కోసమే తన పోరాటమని కవిత స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి విప్లవాత్మక మైన మార్పులు రావాలని.. అన్ని వర్గాలకు అధికారం అందాలని ఆకాంక్షించారు. బీసీలకు భిక్షం వేయొద్దని.. బిక్షం వేస్తే తీసుకోవడానికి వాళ్ళు బిచ్చగాళ్ళు కాదన్నారు. బీసీల పేరుతో కాంగ్రెస్ ఢిల్లీలో దొంగ దీక్షలు చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి బీసీల ద్రోహిగా మిగిలిపోతారని.. నూటికి నూరు శాతం బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేయాలని డిమాండ్ చేశారు. జమలాపురం టెంపుల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జమలాపురం ఆలయంపై దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు. పాతర్లపాడులో సామినేని రామారావు దారుణ హత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. రామారావు హత్యపై డీజీపీని కలువనున్నట్లు కవిత తెలిపారు. హత్యా రాజకీయాలు సరికాదన్నారు. రేపు (బుధవారం) హైదరాబాద్‌లో సింగరేణి కార్మికుల సమస్యలపై సింగరేణి భవన్‌ను ముట్టడించబోతున్నామని ప్రకటించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి, కొత్తగూడెం, మహబూబాద్ జిల్లాలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ఆయకట్టు స్థిరీకరించి రైతాంగానికి సాగు నీరు అందించాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల భూమి వచ్చే వరకు వారి తరఫున పోరాడుతామని స్పష్టం చేవారు. తెలంగాణలో పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని.. సీసీఐతో మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌లో మరోమారు ఐటి దాడులు

- పాస్తాహౌజ్, షాగ్ హౌజ్, మెహిఫిల్ హోటల్ లో అక్రమాలు
- ప్రముఖ హోటల్ యజమానుల ఇళ్లల్లో సోదాలు

**హైదరాబాద్, నవంబరు 18 :** నగరంలో మరోసారి ఐటీ దాడులు కలకలం రేపింది. ప్రముఖ హోటళ్ల చైర్మన్‌లు, డైరెక్టర్ ఇళ్లలో సోదాలు చేపట్టారు. హైద్రాబాద్ కేంద్రంగా నడుస్తున్న హోటల్స్ బిజినెస్‌పై ఐటీ సోదాలు నిర్వహించారు. మొత్తం 30 చోట్ల ఏకకాలంలో ఇన్కమ్ టాక్స్ అధికారులు సోదాలు చేపట్టారు. పిస్తా హౌస్, షాగ్ మౌస్, మేహిఫెల్ హోటల్లో యజమానుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. పిస్తా హౌస్, షాగౌస్ , మేహిఫెల్ హోటల్స్ ప్రతి ఏటా వందల కోట్లు వ్యాపారం చేస్తున్నాయి. ఈ హోటల్స్ ప్రధాన కార్యాలయంలో ఐటీ అధికారుల తనిఖీలు కొనసాగాయి. రాజేంద్రనగర్‌లోని పిస్తా హౌస్ ఓనర్ మహమ్మద్ మజీద్, మహమ్మద్ ముస్తాన్ ఇళ్లల్లో ఐటీ అధికారులు సోదాలు చేసారు. ఈ క్రమంలో రికార్డుల్లో చూపిన ఆదాయం, నిజమైన ఆదాయం మధ్య వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. హవాలా, నకిలీ లావాదేవులు, అనుమానాస్పద ట్రాన్సాక్షన్ ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ట్యాక్స్ చెల్లింపులో వ్యత్యాసం ఉన్నట్లు ఐటీ అధికారులు గుర్తించారు. పిస్తా హౌస్ ఓనర్ మజీద్ నివాసంలో ఆరు బృందాలు సోదాలు జరుపుతున్నాయి. పిస్తా హౌస్‌లో పనిచేసే వర్కర్ల ఇళ్లల్లోనూ, వర్కర్లకు కల్పించిన వసతి నివాసాల్లోనూ సోదాలు జరుగుతున్నాయి. వారికి సంబంధించిన ఫోన్లు, కంప్యూటర్లను ఐటీ అధికారులు చెక్ చేశారు. ఫోన్లలో, కంప్యూటర్లో ఉన్న డేటాను ఐటీ శాఖకు సంబంధించిన హ్యాకర్లు విశ్లేషిస్తున్నారు. అయితే పిస్తా హౌస్ అకౌంటెంట్ మాత్రం అందుబాటులోకి రాని పరిస్థితి. బినామీల పేర్లతో ఆస్తులు ఉన్నట్లు ఆరోపణల నేపథ్యంలో వర్కర్ల ఇళ్లలోనూ సోదాలు జరుగుతున్నాయి. సోదాల్లో కీలకమైన డాక్యుమెంట్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కంప్యూటర్ కి సంబంధించిన హార్డ్ డిస్కులు, కీలక పత్రాన్ని సీజ్ చేశారు. అంతే కాకుండా వర్కర్ల నుంచి ఐటీ అధికారులు కీలక సమాచారం రాబట్టినట్లు సమాచారం. కాగా.. సుమారు 600 మంది పైగా ఐటీ అధికారులు 30 బృందాలుగా ఏర్పడి నగరంలోని వివిధ ప్రాంతాల్లో సోదాలు జరిపారు.



# క్రమంగా తగ్గుతున్న బంగారం ధరలు

**రూ.1.25 లక్షల వద్ద కొనసాగుతున్న తులం రేటు**

**హైదరాబాద్, నవంబర్ 18 :** దేశీయంగా పసిడి ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగానూ బంగారం ధరలుతగ్గుముఖం పట్టాయి. మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1.25 లక్షలు పలుకుతోంది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం రూ.1.14 లక్షల వద్ద కొనసాగుతోంది. అటు వెండి ధర సైతం కిలో రూ.1.56 లక్షలుగా ఉంది. అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా బంగారం ధరలు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. ఈనెల 13వ తేదీన 10 గ్రాముల పసిడి రూ.1.30 లక్షల వద్ద ఉంది. ఐదు రోజుల వ్యవధిలో రూ.5వేల మేర తగ్గింది. వెండి కిలో రూ.1.70 లక్షలు ఉండేది. అప్పటితో పోలిస్తే దాదాపు రూ.15వేలు తగ్గింది. అప్పట్లో అంతర్జాతీయంగా ఔన్సు బంగారం 4200 డాలర్లుగా ఉండగా.. ఇప్పుడు 4010 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ప్రస్తుతం ఔన్సు 49 డాలర్లుగా ఉంది. ఈ ధరలను అనుసరించి దేశీయంగానూ ధరలు తగ్గుముఖం పట్టాయి. సాధారణంగా బంగారానికి, అమెరికాలోని వడ్డీ రేట్లకు విలోమ సంబంధం ఉంటుంది. ఫెడ్ వడ్డీ రేట్లు పెంచినప్పుడు బంగారం ధర పడుతుంది. తగ్గినప్పుడు పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అమెరికా డాలర్ బలపడటం, వచ్చే నెల ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు క్షీణించడంతో పసిడికి డిమాండ్ తగ్గింది. దీనికితోడు డాలర్ ఇండెక్స్ బలపడడమూ మరో కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు. అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ ముగిసిన నేపథ్యంలో కీలక ఎకనామిక్ డేటా ఈ వారం వెలువడనుంది. ఫెడ్ గత మీటింగ్‌కు సంబంధించిన మినిట్స్, సెప్టెంబర్ నెలకు సంబంధించి జాబ్స్ డేటా ఈ బుధ, గురువారాల్లో వెలువడనుంది. ఈ డేటా ఫెడ్ వడ్డీ రేట్ల నిర్ణయాన్ని, బంగారం ధరలను ప్రభావితం చేయనుంది. వాస్తవానికి వచ్చే నెలలో మరోమారు వడ్డీ రేట్లలో కోత ఉంటుందని తొలుత అంచనాలు ఉన్నప్పటికీ.. ఫెడ్ అధికారులు మాత్రం దీనిని తోసిపుచ్చుతున్నారు.

# నందిగామ వద్ద లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

**నందిగామ:** విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై నందిగామ సమీపంలోని అనాసాగరం వద్ద మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొంది. ఈ ఘటనలో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. నందిగామ శివారు అనాసాగరం బైపాస్ వద్ద లారీని ట్రావెల్స్ బస్సు ఓవర్‌టేక్ చేస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఈ బస్సులో మొత్తం 20 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాలకు చెందిన ప్రయాణికులుగా గుర్తించారు. పోలీసులు వెంటనే ఘటనాస్థలికి వెళ్లి క్షతగాత్రులను నందిగామ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు పంపించారు. బస్సు, లారీని క్రేన్‌తో తొలగించి జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



## మాదిగ వనసమారాధన కరపత్రం ఆవిష్కరణ

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** పాలేరు నియోజకవర్గ మాదిగ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాదిగ వన సమారాధన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐక్య వేదిక నాయకులు పిలుపు నిచ్చారు. ఖమ్మం రూరల్ మండలంలోని రెడ్డిపల్లిలోని ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నియోజకవర్గ స్థాయి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ మొదటివారంలో నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించి చేపట్టాల్సిన కార్యచరణ పై చర్చా పే కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదిగ కుటుంబ సభ్యులు కుటుంబాలతో సహా పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెరుకుపల్లి భాస్కర్, కందుకూరి వెంకటనారాయణ, అశోక్, దాసు, రవి, శేఖర్, గర్జన్, అనిల్, రాంబాబు, వెంకటేశ్వర్లు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.




## 5వ నషా ముక్తా భారత్ అభియాన్

- మాదక ద్రవ్యాల నిరోధక సామూహిక ప్రతిజ్ఞ
- వాజేడు ఎంఈఓ వెంకటేశ్వరరావు




**వాజేడు, రాజముద్ర న్యూస్:** మండల కేంద్రంలో వాజేడు నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 5వ నషాముక్త భారత్ అభియాన్,మారక ద్రవ్యాల నిరోధక సామూహిక ప్రతిజ్ఞ,లో మండల విద్యాశాఖ తేజావత్ వెంకటేశ్వర రావు, స్థానిక అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ లఖీస్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని,ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని,సమాజానికి హాని కలిగించే డ్రగ్స్ వ్యక్తులకు,కుటుంబాలకు,సమాజానికి, దేశానికి, తీవ్రమైన హాని కలిగిస్తాయని,కల్తీ కల్లు, గంజాయి, అల్ప్రాజోలం డైజోఫాం,లాంటి డ్రగ్స్ వాడడం వలన ఆరోగ్యం దెబ్బ తినడమే కాకుండా ప్రాణ హాని కలుగుతుందని, యువకులు గంజాయి మత్తు పదార్థాలకు జల్సాలకు అలవాటు పడి ఉజ్వల భవిష్యత్తు నిర్వీర్యం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోధ్యాయులు పోరిక స్వరూప్ సింగ్, చల్లగురుగుల మల్లయ్య, ఎ.వెంకట రమణ,రంగు ఆనంద్, పోరిక రవి కుమార్,బొగ్గం కుమార్ బాబు,తెల్లం రాజ్యలక్ష్మి,షిండే రాజేష్,కోకిల శ్రీరంగం, జర్పుల వస్య తదితరులు పాల్గొన్నారు.

## చలి పొగ మంచు ప్రభావం వాహనదారుల ప్రయాణం నిదానం

### పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్



**వాజేడు, రాజముద్ర న్యూస్ :** చలి,పొగ మంచు ప్రభావితం వల్ల వాహనదారులు రోడ్లపై తరుచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకోని ఉదయము పూట దట్టమైన పొగమంచు కారణంగా దారి సరిగా కనబడక మరిన్ని ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున ప్రజలు తమ ప్రయాణాలను పొగమంచు తొలగిపోయే వరకు వాయిదా వేసుకుని సురక్షితమైన గమ్యాన్ని చేరుకోవాలని, పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ అన్నారు, ప్రయాణించేటప్పుడు తగిన సూచనలు తీసుకుంటూ వాహనం యొక్క హెడ్ లైట్, పార్కింగ్ లైట్, ఇండికేటర్స్, మొదలగునవి వెలిగించుకుంటూ నెమ్మదిగా తమ ప్రయాణాన్ని కొనసాగించాలని, వాహనదారులు తమ వాహనాలను రోడ్లపై నిలపడంగాని, ధాన్యం రోడ్లపై ఆరబోయడం గాని చేయరాదని,వీటి వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయి కాబట్టి తగిన సూచనలు పాటించాలని తెలిపారు.



## ఘనంగా అభయాంజనేయ స్వామికి కార్తీక మాసం ప్రత్యేక పూజలు



**వాజేడు,రాజముద్ర న్యూస్ :** మండల కేంద్రంలో చిన్న గొల్లగూడెం గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం కార్తీక మాస పర్వదినం పురస్కరించుకొని, అభయాంజనేయ స్వామికి పాలాభిషేకం చేశారు. అర్చకులు రవీంద్ర చారి ఆధ్వర్యంలో భక్తులు హెూమగుండం,దీపారాధన చేసి అభయాంజనేయ స్వామివారికీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చుట్టూ ప్రదక్షిణలు చేసి, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడిపంటలు ఆయురారోగ్యాలు సుఖసంతోషాలతో ఉండాలని, కొబ్బరికాయలు కొట్టి పూలు, పండ్లు,నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

# ఇచ్చిన మాట నెరవేర్చేందుకు ప్రభుత్వం పని చేస్తుంది

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- గూడూరుపాడులో బిటి రోడ్ నిర్మాణ పనులకి శంఖుస్థాపన

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** పేదలకు ఇచ్చిన ప్రతి మాట నెరవేర్చేందుకు ప్రభుత్వం పని చేస్తుందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని గూడూరు పాడు గ్రామంలో మంగళవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో గూడూరు పాడు గ్రామ అభివృద్ధికి 8 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేశామని తెలిపారు. స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు కోల్డ్ స్టోరేజ్ రోడ్డు మార్గం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గూడూరు పాడు నుండి ఆకేరు వయా శ్మశానవాటిక వరకు కోటి 10 లక్షలతో, ఎం.వి.పాలెం – గూడూరు పాడు రోడ్డు నుండి గూడూరు పాడు చెరువు అలుగు వరకు 3 కోట్ల 30 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని వెల్లడించారు. పేదల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు పూర్తి స్థాయిలో ఆశీర్వదించాలని మంత్రి పొంగులేటి కోరారు. ఈ కార్యక్రమంలో



అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్,ఆర్డీఓ నరసింహా రావు,ఎంపీడీఓ,ఆర్ అండ్ బి ఎస్ఈ యాకోబు,సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# హసీనాకు మరణశిక్ష..

## బంగ్లాదేశ్‌లో భారీ నిరసనలు



**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు స్థానిక 'ఇంటర్నే షనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్' మరణ శిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ.. హసీనా మద్దతుదారులు బంగ్లాదేశ్‌లో ఆందోళనలు చేపట్టారు. దీంతో దేశంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితు లు నెలకొన్నాయి. ఈ అల్లర్లలో ఇద్దరు మృతి చెందగా పలువురు గాయపడినట్లు తెలుస్తోంది. ఢాకా సహా దేశంలోని పలు ప్రాంతాల్లో ఐసీటీ తీర్పునకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిస్తూ రెండు రోజులపాటు బంద్ ప్రకటిస్తున్నట్లు అవామీ లీగ్ ప్రకటించింది. దీంతో యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఆయా ప్రాంతా ల్లో పోలీసులను మోహరించింది. షేక్ హసీనా తండ్రి ముజిబుర్ రెహమాన్ ఇల్లు ఉన్న ధన్మొండి 32 సహా పలు ప్రాంతాల్లో హసీనా మద్దతుదారులు రహదారులను దిగ్బంధించి, ఇతర నివాసాలు, దుకాణాల పైకి రాళ్లు రువ్వడంతో వారిని చెదరగొట్టడానికి పోలీసులు సౌండ్ గ్రెనేడ్‌లు, టియర్ గ్యాస్‌ను ఉపయోగించాల్సి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. పోలీసులు నిరసనకారు లపై లాఠీ ఛార్జీ చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

### హసీనా ప్రకటనలు ప్రసారం చేయొద్దని మీడియాకు హెచ్చరికలు..

పరారీలో ఉన్న షేక్ హసీనా సోషల్ మీడియా వేదికగా చేస్తున్న పోస్టులు, ప్రకటనలకు సంబంధించిన విషయాలను ప్రచారం చేయొద్దని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం అన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్, ఆన్‌లైన్ మీడియా సంస్థలను హెచ్చరించింది. దేశంలో శాంతిభద్రతల దృష్ట్యా హింస, నేర కార్యకలాపాలను ప్రేరేపించే హసీనా వ్యాఖ్యలను ప్రసారం చేయొద్దని తెలిపింది. ఇవి సైబర్ భద్రతా ఆర్డినెన్స్ నిబంధనల ఉల్లంఘనల కిందకు వస్తాయని పేర్కొంది. అటువంటి వార్తలు ప్రసారం చేసేవారికి రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తామంది. విద్యార్థుల ఆందోళనలతో ప్రధాని పదవి వీడిన షేక్ హసీనా.. గతేడా ది ఆగస్టులో బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చారు. నాటినుంచి దిల్లీలోని ఓ రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు. స్వదేశంలో ఆందో ళనల సమయంలో మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారని ఆమెపై కేసులు నమోదయ్యాయి. వాటిని విచారించిన ఐసీటీ సోమవారం హసీనాను దోషిగా తేల్చింది. ఈ క్రమంలోనే ఆమెకు మరణ శిక్ష విధించింది. ఈ తీర్పును ఆమె ఖండించారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా ఏర్పడిన ప్రభుత్వం కుట్రపూరితంగా తనకు శిక్ష పడేలా చేసిందని విమర్శించారు. తనకు వ్యతిరేకంగా తీర్పు వచ్చినందుకు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని తన పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దీంతో అవామీ లీగ్ పార్టీ మంగళవారం దేశవ్యాప్తంగా బంద్ ప్రకటించింది.

# మంత్రి పొంగులేటి కృషితోనే తండాల అభివృద్ధి

- యువజన కాంగ్రెస్ నాయకులు వడిత్యా కుమార్
- 3.75 కోట్లతో బిటి రోడ్ నిర్మాణ పనులు ప్రారంభం

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** పదేళ్లపాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ హయాంలో అభివృద్ధికి నోచుకోని మారుమూల తండాలు, గ్రామాలు నేడు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక కృషితో అభివృద్ధిలో సరికొత్త రూపు సంతరించుకుంటున్నాయని యువజన కాంగ్రెస్ నాయకులు వడిత్యా కుమార్ అన్నారు. కూసుమంచి మండలంలోని ధర్మతండాలో ధర్మా తండా నుండి లోక్యాతండా వయా కొత్తతండా వరకు సుమారుగా 3.75 కోట్ల రూపాయలతో నూతనంగా మంజూరైన బిటి రోడ్ నిర్మాణ పనులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం గిరిజన తండాలను చిన్న చూపు చూస్తూ అభివృద్ధిని విస్మరిస్తే,ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ వ్యవధిలోనే మంత్రి పొంగులేటి చొరవతో గిరిజన తండాలు సైతం అభివృద్ధిలో అగ్రగామిగా రూపు దిద్దుకుంటున్నాయాని తెలిపారు. అనంతరం బిటి రోడ్



మంజూరుకి సహకరించిన ఖమ్మం క్యాంప్ కార్యాలయం ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి,కూసుమంచి క్యాంప్ కార్యాలయం ఇంచార్జి భీమిరెడ్డి శ్రీనివాస రెడ్డికి తండా వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జర్పుల నాగేశ్వరావు,వడిత్యా లచ్చిరాం,రాములు,దాసు,లచ్చు, వడిత్యా నాగేశ్వరావు, జర్పుల లక్ష్మణ్, బానోతు శ్రీను, రమేష్, మదీన్, పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దు

### రాజారంపేట పిఏసిఎస్ చైర్మన్ ధీరావత్ బాలాజీ

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంటను దళారులకు విక్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం విక్రయించాలని సొసైటీ చైర్మన్ ధీరావత్ బాలాజీ అన్నారు. నేలకొండపల్లి మండలంలోని రాజారంపేట గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి మద్దతు ధర 2389 రూపాయలు,కామన్ గ్రేడ్ కి 2369 రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయించి కొనుగోళ్లు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం వరికి బోనస్ కూడా అందిస్తున్నందున రైతులు ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు కాటం వెంకటరెడ్డి,పఠాన్ దిలావర్ ఖాన్, తేజావత్ కోటేశ్వరరావు,సొసైటీ మాజీ చైర్మన్ ఈవూరీ శ్రీనివాస్ రెడ్డి,ఏఎంసీ డైరెక్టర్ సురేపల్లి రవి,ఎడవెల్లి శ్రీను,అమరగాని ఎల్లయ్య,యరదేసి నరసింహారావు,కార్యదర్శి పమ్మీ రామకోటయ్య,ఏఈఓ శ్రీకాంత్,సిబ్బంది,రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## వరి కొయ్యలను తగలబెట్టవద్దు

### వ్యవసాయాధికారి రామడుగు వాణి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** వరి కొయ్యలను తగలబెట్టడం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు, నేల ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని కూసుమంచి మండల వ్యవసాయాధికారి రామడుగు వాణి రైతులకి తెలిపారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో వరికొయ్యలను తగులబెడుతున్న వ్యవసాయ క్షేత్రాలను మంగళవారం ఆమె క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక టన్ను వరిగడ్డి కాల్చడం వల్ల 5.5 కిలోల నత్రజని, 2.3 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాషియం, 1.2 కిలోల సేంద్రియ కార్బన్ కోల్పోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా 60 కిలోల కార్బన్ మోనాక్సైడ్, 1460 కిలోల కార్బన్ డయాక్సైడ్, 199 కిలోల బూడిద, 2 కిలోల సల్ఫర్ డయాక్సైడ్ వాతావరణంలోకి విడుదలై వాయు కాలుష్యం ఏర్పడుతుందన్నారు. దీనికి తోడు మానవుల ఊపిరితిత్తులకు సమస్యలు కలిగించే క్యాన్సర్ కారుకాలు విడుదలవడంతో పాటుగా మండే అవశేషాల నుండి వచ్చే వేడి నేల ఉష్ణోగ్రతను పెంచి నేలలో ఉండే ప్రయోజనకరమైన సూక్ష్మ జీవులు మరణిస్తాయని వెల్లడించారు. భూమిలో ఉన్న ఉపయోగకరమైన సూక్ష్మజీవులు చనిపోవడమే కాక,భూమిలోని తేమశాతం కూడా తగ్గుతుందని చెప్పారు. కావున రైతులు వరి పంట అవశేషాలను తగలబెట్టకుండా భూమిలో కలియదున్నడం వల్ల భూసారం పెరుగి,భూమికి అవసరమైన పోషకాలు అందుతాయని తెలియజేశారు. అనంతరం ఎర్రగడ్డతండాలో యాసంగి పంట కాలానికి వరి నారుమడి కోసం విత్తనాలను చల్లుతున్న సైదులు అనే రైతు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి చలికాలంలో నారుమడి పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ,రైతులు సీతారాములు తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారుల మిస్సింగ్ కేసుల పెరుగుదల ఆందోళనకరం: సుప్రీం

**న్యూఢిల్లీ :** దేశంలో చిన్నారుల మిస్సింగ్ కేసులు రోజురోజుకు పెరుగుతుండడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి 8 నిమిషాలకు ఒక చిన్నారి తప్పిపోతున్నట్లు వచ్చిన మీడియా కథనాన్ని ప్రస్తావిస్తూ.. మిస్సింగ్ కేసులు దేశంలో తీవ్రమైన సమస్యగా మారుతున్నాయని పేర్కొంది. దత్తత ప్రక్రియ కఠినంగా ఉన్నందువల్ల.. పిల్లలు లేనివారు చట్టవిరుద్ధమైన మార్గాలను ఎంచుకుంటున్నారని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. సంక్లిష్టంగా ఉన్న దత్తత ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి, అక్రమ దత్తతను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దేశంలో పిల్లలను దత్తత తీసుకునే విధానం ఎక్కువయ్యిందని.. దత్తత ముసుగులో చిన్నారుల అక్రమ రవాణా, అమ్మకాలు పెరిగిపోతున్నాయని ఓ స్వచ్ఛంద సంస్థ వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తప్పిపోయిన పిల్లల కేసులపై విచారణ చేపట్టడానికి నోడల్ అధికారిని నియమించడానికి ఆరు వారాల సమయం ఇవ్వాలని కేంద్రం తరఫు న్యాయవాది కోర్టును కోరారు. అందుకు నిరాకరించిన ధర్మాసనం డిసెంబర్ 9 నాటికి ఈ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించింది. మిస్సింగ్ కేసులను నిర్మూలించడానికి ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని పేర్కొంది. కాగా తప్పిపోయిన పిల్లల కేసులను పర్యవేక్షించడానికి నియమించిన నోడల్ అధికారుల వివరాలను ఆన్‌లైన్ సహా అన్ని మాధ్యమాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని సుప్రీంకోర్టు గతనెల 14న కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఇందుకోసం ఒక పోర్టల్ రూపొందించి... దానిలో అన్ని వివరాలు పొందుపరచాలని ఆదేశించింది. పోర్టల్‌లో అదృశ్యమైన పిల్లల గురించి ఫిర్యాదు అందిన వెంటనే నోడల్ అధికారులు చర్యలు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. పోర్టల్‌లో వచ్చే ఫిర్యాదుల ఆధారంగా పిల్లలను కిడ్నాప్ చేసే నేరస్థులపై కేసులు నమోదు చేసి.. తగిన చర్యలు తీసుకోవచ్చని తెలిపింది.




## ఢిల్లీలో మరోమారు బాంబు బెదిరింపులు

### పాటియాల కోర్టు తదితర ప్రాంతాల్లో స్క్వాడ్ తనిఖీలు

**న్యూఢిల్లీ, నవంబరు 18 :** దేశ రాజధాని ఢిల్లీలో బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. రాజధానిలోని పలు కోర్టులు, పాఠశాలలే లక్ష్యంగా బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన పోలీసులు వెంటనే భద్రతా చర్యలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. సాకేత్ కోర్టు, పాటియాలా హౌస్ కోర్టు, తీస్ హజారీ కోర్టు సహా ఇతర జిల్లా కోర్టులకు మంగళవారం ఉదయం బాంబు బెదిరింపులు వచ్చాయి. అంతేకాదు నగరంలోని ద్వారకా, ప్రశాంత్ విహార్ ప్రాంతాల్లోని సీఆర్‌పీఎఫ్ పాఠశాలలను లక్ష్యంగా చేసుకొని బెదిరింపులకు పాల్పడ్డారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే భద్రతా చర్యలు చేపట్టారు. బృందాలుగా విడిపోయి కోర్టులు, పాఠశాలల ప్రాంగణాలకు చేరుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా కోర్టు ప్రాంగణాలతోపాటూ పాఠశాలలను ఖాళీ చేయించిన అధికారులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. అంతేకాదు, నగరంలోని అన్ని జిల్లా కోర్టుల్లోని సిబ్బందిని అప్రమత్తం చేసి భద్రతా తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతం సోదాలు కొనసాగుతు న్నాయి. మరోవైపు ఈ బెదిరింపు మెయిల్‌పై అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాజధానిలో భారీ ఉగ్ర కుట్రకు ప్లాన్ అంటూ వార్తలు వస్తున్న వేళ బాంబు బెదిరింపులు కలకలం రేపాయి.



## ఆత్మాహుతిని సమర్థిస్తూ సంచలన వీడియో

### బయటపడ్డ డాక్టర్ ఉమర్ నబీకి చెందిన వీడియో

**న్యూఢిల్లీ, నవంబరు 18 :** ఢిల్లీ పేలుడు కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా ఎర్రకోట వద్ద ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీకి చెందిన సంచలన వీడియో బయటకు వచ్చింది. పేలుడుకు ముందు అతడు సూసైడ్ బాంబింగ్ గురించి మాట్లాడాడు. అందులో అతడు ఆత్మాహుతి దాడిని సమర్థిస్తూ మాట్లాడాడు. సూసైడ్ బాంబింగ్ గురించి అందరూ తప్పుగా అర్థం చేసుకుంటారని.. వాస్తవానికి అదొక బలిదాన ఆపరేషన్‌గా అతడు అభివర్ణించారు. 'ఆత్మాహుతి బాంబు దాడికి వ్యతిరేకంగా అనేక వాదనలు ఉన్నాయి. మరణంపై ఉన్న సహజ అంచనాలకు వ్యతిరేకంగా ఓ వ్యక్తి నిర్దిష్ట సమయంలో, నిర్దిష్ట ప్రదేశంలో కచ్చితంగా చనిపోతాడని భావించడాన్ని బలిదాన ఆపరేషన్ అంటారు' అంటూ ఉమర్ ఆ వీడియోలో వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ వీడియో సంచలనం రేపుతోంది.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజాబాట కార్యక్రమం

### మాజీ మేయర్ అమర్ సింగ్

- పీర్జాదిగూడ నగరంలో నూతన సబ్ స్టేషన్ ను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నాం
- 26వ డివిజన్ లో విద్యుత్ సమస్యలను తెలుసుకునేందుకు ప్రజాబాట కార్యక్రమం నిర్వహించిన విద్యుత్ అధికారులు
- పాల్గొన్న స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, టీజీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ చక్రపాణి, హబ్సిగూడ సర్కిల్ ఎస్ ఈ ప్రతిమ సోను, డి ఈ కీసర లింగయ్య, ఏడి కుమార్ రెడ్డి, ఏఈ సత్యనారాయణ రెడ్డి, పలువురు విద్యుత్ సిబ్బంది






**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** ప్రజలకు విద్యుత్ సమస్యలు లేకుండా నిరంతరం శ్రమిస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం ప్రజాబాట కార్యక్రమం చేపట్టడం వలన కాలనీలలో సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి సత్వరమే పరిష్కారానికి కృషి చేస్తున్నామని టీజీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ చక్రపాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా పీర్జాదిగూడ నగర పరిధిలోని 26వ డివిజన్ శంకర్ నగర్ లో విద్యుత్ సమస్యలను పరిశీలించారు. పీర్జాదిగూడ నగర మాజీ మేయర్ అమర్ సింగ్ స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాబాట కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యుత్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. డైరెక్టర్ తో పాటు హబ్సిగూడ సర్కిల్ ఎస్ ఈ హబ్సిగూడ సర్కిల్ ఎస్ ఈ ప్రతిమ సోను, డి ఈ కీసర లింగయ్య, ఏడి కుమార్ రెడ్డి, ఏఈ సత్యనారాయణ రెడ్డి, పలువురు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజలకు విద్యుత్ సమస్య లేకుండా చూడడమే ప్రజా బాట కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విర్జాదిగూడ నగరంలో పీర్జాదిగూడ నగరంలో నూతనంగా సబ్‌స్టేషన్ నిర్మించడానికి స్థలాన్ని చూయించినట్లయితే నూతన సబ్ స్టేషన్ ను నిర్మించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఏ కాలనీలోనైనా నూతనంగా ట్రాన్స్ఫార్మర్ విద్యుత్ స్తంభాలు కావాలంటే వెంటనే తెలియజేయాలని కోరారు. ఏది ఏమైనా పీర్జాదిగూడ నగరంలో ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్య లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ... పీర్జాదిగూడ నగరంలో ఏఈ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో కాలనీలలో ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల అభినందనలు పొందుతున్నారని తెలిపారు. వారు ఎల్లప్పుడూ ప్రజల మధ్యన ఉంటూ సిబ్బందితో పాటు విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారని తెలిపారు. మాజీ మేయర్ అమర్ సింగ్ డైరెక్టర్ చక్రపాణిని శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా పలువురు అధికారులను, మాజీ మేయర్ అమర్ సింగ్‌ను పప్పుల అంజిరెడ్డి శాలువాలతో సత్కరించి ధన్యవాదములు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులతో పాటు సిబ్బంది స్థానిక ప్రజలు శివరామిరెడ్డి, ధర్మరాజు పాల్గొన్నారు.

# నిరంతర కృషివలుడు సత్యప్రసాద్

- తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఐఏఎస్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్
- ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్ చేసిన కృషిని కీర్తిస్తూ ప్రశంసా పత్రం అందజేత
- ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు నిరంతర కృషి
- అందరితో కలివిడి ఉండడమే ఆయన నైజం



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** నిరంతరం విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే విధంగా పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులను సైతం బావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్ సేవలు వెలకట్టలేనివని పలువురు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఐఏఎస్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. నిరంతరం విద్యార్థులను తీర్చిదిద్దుతున్న కృషికి ఫలితం దక్కిందని పలువురు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సత్య ప్రసాద్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ వారి సేవలను గుర్తించి ప్రశంసా పత్రాలను అందజేయడం ఆనందంగా ఉందని తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయుల


Government of Telangana
Department of School Education
TELANGANA RISING 2047

CERTIFICATE OF APPRECIATION

This Certificate of Appreciation is proudly presented to

Sri/Smt. L. Satya Prasad HM ZPHS Medipally, Medchal Malkajgiri

in recognition of their unwavering dedication and exceptional commitment to education, demonstrated by going far beyond the call of duty to ensure the success, well-being, and holistic development of students. Through acts of selflessness and innovation—whether supporting students with resources, creating opportunities for learning—they have truly embodied the spirit of service and educational excellence.

Their relentless passion and extraordinary efforts serve as an inspiring model for the teaching community and contribute immensely to shaping the future of our schools and children.

Dr. E. Naveen Nicolas, IAS
Director of School Education
Government of Telangana

మార్గదర్శకత్వంతో ఉన్నత స్థాయికి చేరుతారని వారు వారి తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చే విధంగా ఆదర్శవంతంగా అన్ని రంగా లలో రాణించాలని కోరారు. గది 4 గోడల మధ్య నేర్చుకున్నటువంటి నైపుణ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా తెలిసేలా వృద్ధి చెందాలని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీకి అనుగుణంగా రాణిస్తూ నూతన ఒరవడిని సృష్టించాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏఐ లాంటి అధునాతన సాంకేతిక విప్లవంలో కూడా ప్రభుత్వ పాఠశాల లో చదివే విద్యార్థులు సైతం పోటీ పడుతుండటం గర్వించ దగ్గ విషయమని తెలిపారు. ఏది ఏమైనా విద్యార్థుల భవిష్య త్తుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఎన్ని ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు ఉన్నతంగా రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటే ఆ ఆనందం ఊహిం చలేనిదని స్పష్టం చేశారు. ప్రశంసా పత్రాన్ని అందించినం దుకు గాను తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు, తోటి సహచర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## హిడ్మా ఎన్‌కౌంటర్‌పై అమిత్ షా డెడ్‌లైన్..

**న్యూఢిల్లీ :** అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు–మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు మధ్వి హిడ్మా మృతిచెందాడు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా విధించిన డెడ్‌లైన్ కంటే ముందే హిడ్మాను ఎన్‌కౌంటర్ చేశారు. నవంబరు 30లోపు హిడ్మా ఆటకట్టించాలని భద్రతా బలగాలను అమిత్‌షా ఆదేశించినట్లు సమాచారం. "2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించాలని అమిత్ షా గడువు విధించారు. ఈ క్రమంలో జరిగిన భద్రతా సమీక్షా సమావేశంలో నవంబర్ 30లోగా హిడ్మా పనిపట్టాలని భద్రతా బలగాలకు ఆదేశాలు ఇచ్చారు. అయితే ఆ డెడ్‌లైన్ కన్నా ముందుగానే ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో హిడ్మా మృతిచెందడం గమనార్హం." అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం జరుగుతోన్న ఆపరేషన్లను చూస్తుంటే.. మార్చి కంటే ముందుగానే నక్సలిజం తుడిచిపెట్టుకుపోతుందని అంచనావేశాయి. దేశంలో మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయించారని గతంలో అమిత్ షా పేర్కొన్న సంగతి తెలిసిందే. హింసను,




ఆయుధాలను వదిలేసి వారు లొంగిపోవాలని లేకపోతే మావోయిస్టుల అంతానికి ఆల్– అవుట్ ఆపరేషన్ నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి మారేడుమిల్లి ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం నేపథ్యంలో కూంబింగ్ నిర్వహించినట్లు చెప్పారు.

## మోదీ.. ఎలక్షన్ మోడ్ కాదు ఎమోషనల్ మోడ్ : శశిథరూర్

**దిల్లీ:** మోదీ సర్కారు అనుకూల వ్యాఖ్యలు చేస్తూ సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ మరోసారి ప్రధానిని ప్రశంసించారు. సోమవారం దిల్లీలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి తనను ఆహ్వానించారని.. ఆ కార్యక్రమంలో ప్రధాని మోదీ భారత్ నిర్మాణాత్మక అభివృద్ధి గురించి ప్రసంగించారని అన్నారు. ఎప్పుడూ ఎలక్షన్ మోడ్‌లో ఉంటానని అందరూ అంటారని తన ప్రసంగంలో మోదీ వెల్లడించిన అంశాన్ని థరూర్ గుర్తుచేశారు. కానీ ప్రజల సమస్యల విషయంలో ప్రధాని ఎప్పుడూ ఎమోషనల్ మోడ్‌లో ఉంటారని కితాబిచ్చారు. దేశంలో విద్యపై వలసవాదం ప్రభావం ఏ విధంగా ఉందనే విషయం గురించి మోదీ చెప్పిన మాటలను ఆయన గుర్తు చేసుకున్నారు. వలసవాద ఆలోచనా విధానం నుంచి బయటపడాలంటే భారతదేశ వారసత్వం, భాషలు, విజ్ఞాన వ్యవస్థలను తిరిగి పునరుద్ధించాల్సిన అవసరముందని ఆయన చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని పేర్కొంటూ.. ప్రధాని మోదీకి సంబంధించిన ఫొటోలను సైతం షేర్ చేశారు. థరూర్ చేసిన పోస్టుపై కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. అసలు థరూర్ ఏ పార్టీలో కొనసాగుతున్నారో చెప్పా లని డిమాండ్ చేశారు. థరూర్ ప్రధానిని ప్రశంసించడం ఇది మొదటిసారి కాదు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత జరిగిన దౌత్యపరమైన కృషి జాతీయ సం కల్పం, ప్రభావవంతమైన వ్యక్తీకరణకు ప్రధానిని రుజువుగా పేర్కొన్నారు.

# 6 రోజుల వరుస లాభాలకు బ్రేక్






**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాల నేపథ్యంలో సూచీలు నష్టాల బాట పట్టాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్, రియాల్టీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. అమెరికా టెక్ స్టాక్స్‌లో విక్రయాల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లు సహా మన మార్కెట్లూ నష్టాలు చవిచూశాయి. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాన్ని ప్రభావితం చేసే కీలక డేటా ఈ వారం వెలువడనుండడంతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. ఈ క్రమంలోనే సూచీల ఆరు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 85,042.37 (క్రితం ముగింపు 84,950.95) వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84,558.36- 85,042.41 మధ్య కదలాడింది. చివరికి 277.93 పాయింట్లు నష్టపోయి 84,673.02 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 103.40 పాయింట్లు క్షీణించి 25,910.05కి పడిపోయింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.61గా ఉంది. సెన్సెక్స్ 30లో టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, ఎటెర్నల్, అదానీ పోర్ట్స్ షేర్లు ప్రధానంగా నష్టాల్లో ముగిశాయి. భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, టైటాన్, పవర్ గ్రిడ్ షేర్లు లాభాలు నమోదు చేశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.02 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,041.49 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## ఎలీ లిల్లీ అల్జీమర్స్ ఔషధానికి సీడీఎస్‌సీఓ అనుమతి

**ఢిల్లీ:** అల్జీమర్స్ చికిత్సకు సంబంధించి ఎలీ లిల్లీ అండ్ కంపెనీ (ఇండియా) రూపొందించిన ఔషధానికి జాతీయ ఔషధ నియంత్రణ సంస్థ అనుమతులు మంజూరు చేసింది. తాము రూపొందించిన డోననేమాబ్ (4350 ఎంజీ/20ఎంఎల్) ఔషధాన్ని దేశీయంగా విక్రయించేందుకు డ్రగ్ రెగ్యులేటర్ సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నుంచి ఆమోదం లభించినట్లు కంపెనీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. అల్జీమర్స్ ప్రారంభ లక్షణాలు కలిగిన ఉన్న పెద్దల్లో వ్యాధి చికిత్స కోసం ప్రతి నాలుగు వారాలకు ఇంట్రావీనస్ (ఐవీ) ఇన్ఫ్యూషన్ ద్వారా ఈ ఔషధాన్ని ఇవ్వాల్సి ఉంటుందని తెలిపింది. స్వల్ప మతిమరుపు కలిగిన వారికీ ఈ ఔషధం పనిచేస్తుందని పేర్కొంది. భారత్‌లో అల్జీమర్స్‌తో బాధపడేవారి అవసరాలను తీర్చేందుకు ఉద్దేశించిన తమ మిషన్‌లో నియంత్రణ సంస్థ నుంచి అనుమతులు లభించడం కీలకమైలురాయి అని ఎలీ లిల్లీ ఇండియా ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ విన్స్లో టక్కర్ పేర్కొన్నారు. అల్జీమర్స్‌తో బాధపడుతున్న వారికి, వారి కుటుంబ సభ్యులకు ఊరట కల్పించడంతో పాటు వ్యాధిగ్రస్తులకు మరింత మెరుగైన జీవనాన్ని అందించడం తమ ఉద్దేశమని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మతిమరుపుతో బాధపడుతున్న 60–70 శాతం మందిలో అల్జీమర్స్ వ్యాధి ఉంటోందని కంపెనీ తెలిపింది. భారత్‌లో ఈ సంఖ్య చాలా ఎక్కువని పేర్కొంది. 2030 నాటికి భారత్‌లో సుమారు 80 లక్షల మంది మతిమరుపుతో బాధపడేవారు ఉంటారని, అందులో అల్జీమర్స్ బాధితుల సంఖ్య కూడా ఎక్కువగా ఉంటుందని కంపెనీ అంచనా వేస్తోంది.



## భారత్-బంగ్లాదేశ్ సిరీస్ వాయిదా..?

వచ్చేనెలలో భారత మహిళల జట్టు, బంగ్లాదేశ్ మధ్య జరగాల్సి ఉన్న పరిమిత ఓవర్ల సిరీస్ వాయిదా పడినట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణ శిక్ష నేపథ్యంలో ఇరు దేశాల సంబంధాల్లో ప్రతిష్టంభన నెలకొంది. ఈ నేపథ్యంలో సిరీస్‌ను వాయిదా వేసినట్లు సమాచారం. ఐసీసీ ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా వచ్చే నెలలో బంగ్లాదేశ్ మహిళల జట్టు భారత పర్యటనకు వచ్చి మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడాల్సి ఉంది. కోల్‌కతా, కటక్‌లో మ్యాచ్‌లు నిర్వహించాలని భావించారు. మ్యాచ్‌ల తేదీలు కూడా ఇంకా ఖరారు చేయలేదు. ఈ సిరీస్ జరగాల్సిన సమయంలో ప్రత్యామ్నాయ సిరీస్‌కు బీసీసీఐ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. 'మేం డిసెంబరులో ప్రత్యామ్నాయ సిరీస్‌ను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తాం. అందు కోసం వేరే బోర్డులతో సంప్రదింపులు జరుపుతున్నాం. బంగ్లాదేశ్‌తో సిరీస్‌కు సంబంధించినంత వరకు మేం ముందుకు వెళ్లట్లేదు' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. దేశంలో విద్యార్థుల ఆందోళనలతో ప్రధాని పదవి వీడిన షేక్ హసీనా.. గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చారు. నాటినుంచి దిల్లీలోని ఓ రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు. స్వదేశంలో ఆందోళనల సమయంలో మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారని ఆమెపై కేసులు నమోదయ్యాయి. వాటిని విచారించిన స్థానిక 'ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్' ఐసీటీ సోమవారం హసీనాను దోషిగా తేల్చింది. ఈ క్రమంలోనే ఆమెకు మరణ శిక్ష విధించింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ.. హసీనా మద్దతుదారులు బంగ్లాదేశ్‌లో ఆందోళనలు చేపట్టారు.



## గిల్ దూరమైతే..
### రుతురాజ్‌ను జట్టులోకి తీసుకోవాలి
### టీమ్ఇండియా మాజీ క్రికెటర్

కోల్‌కతా టెస్టులో మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తూ గాయపడటంతో రిటైర్డ్ అవుట్‌గా గిల్ వెనుదిరిగాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ అతడు బరిలోకి దిగలేదు. శనివారం నుంచి గువాహటి వేదికగా దక్షిణాఫ్రికాతో జరగనున్న రెండో టెస్టులో అతడు ఆడటం లేదన్న వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. ఒకవేళ గిల్ ఆడకుంటే అతడి స్థానంలో రుతురాజ్ గైక్వాడ్‌కు అవకాశం కల్పించాలని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా అభిప్రాయపడుతున్నాడు. 'గిల్ రెండో టెస్ట్ ఆడతాడా?లేదా? అనే విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. కానీ ఒకవేళ అతడు దూరమైతే.. అతడి స్థానంలో రుతురాజ్ గైక్వాడ్‌ను ఆడించాలి. అయితే ఇప్పటికే జట్టును ప్రకటించారు. అతన్ని ఎలా తీసుకుంటారనే ప్రశ్న వస్తుంది. కానీ.. సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్ రిజర్వ్‌లో ఉన్నారు. వీరిద్దరూ ఎడమచేతి వాటం బ్యాటర్లు. ఇప్పటికే తుది జట్టులో ఆరుగురు లెఫ్ట్ హ్యాండర్లు ఉన్నారు. వీరిద్దరిలో ఎవరిని తీసుకున్నా.. ఏడుగురు ఎడమచేతి వాటం బ్యాటర్లవుతారు. ఇది సమంజసం కాదు' అని ఆకాశ్ చోప్రా.. తన యూట్యూబ్ ఛానల్‌లో విశ్లేషించాడు. అభిమన్యు ఈశ్వరన్, సర్ఫరాజ్‌ఖాన్ కుడి చేతివాటం బ్యాటర్లు. వీరితోనూ గిల్ స్థానాన్ని భర్తీ చేయొచ్చు. కానీ, ఆకాశ్‌చోప్రా మాత్రం రుతురాజ్ గైక్వాడ్‌కు మద్దతుగా నిలుస్తున్నాడు. 'రుతురాజ్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అతడు భారత్ ఏ తరఫున వన్డేల్లో పరుగులు రాబడుతున్నాడు. కానీ అతడికి భారత్ ఏ తరఫున రెడ్‌బాల్ క్రికెట్‌లో అవకాశాలు దక్కడం లేదు. రుతురాజ్.. రంజీ, దులీప్ ట్రోఫీల్లో చక్కగా రాణించాడు' అని ఆకాశ్‌చోప్రా పేర్కొన్నాడు. రుతురాజ్ గైక్వాడ్ చివరిసారిగా 2024లో(జులై) టీమ్ఇండియా తరఫున టీ20 ఆడుతూ కనిపించాడు. ఇప్పటివరకు భారత్ తరఫున టెస్ట్ మ్యాచ్ ఆడలేదు. దేశవాళీల్లో మాత్రం చక్కటి ప్రదర్శన చేస్తున్నాడు. సెప్టెంబర్‌లో జరిగిన దులీప్ ట్రోఫీ సెమీఫైనల్‌లో వెస్ట్ జోన్ తరఫున ఆడిన రుతురాజ్ 184 పరుగులు చేశాడు. రంజీ ట్రోఫీలో ఇప్పటివరకు మూడు హాఫ్ సెంచరీలు, ఒక సెంచరీ సాధించాడు. అలాగే నవంబర్ 13న దక్షిణాఫ్రికా ఏ, ఇండియా ఏకు మధ్య జరిగిన అనధికారిక తొలివన్డే మ్యాచ్‌లో 68 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గానూ నిలిచాడు.

# రెండో టెస్టుకు పంత్ సారథ్యం!



కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తూ శుభ్‌మన్ గిల్ గాయపడిన విషయం తెలిసిందే. సైమన్ హార్మర్ బౌలింగ్‌లో (35వ ఓవర్‌లో) అతడు స్వీప్ షాట్ ఆడాడు. ఆ సమయంలో గిల్ మెడ కండరం పట్టేయడంతో నొప్పితో విలవిల్లాడాడు. ఫిజియో వచ్చి పరీక్షించినా, బ్యాటింగ్ కొనసాగించలేకపోవడంతో గిల్ మైదానాన్ని వీడాడు. అతడు మొత్తంగా మూడు బంతులే ఎదుర్కొన్నాడు. తర్వాత అతడు మొదటి ఇన్నింగ్స్‌తో పాటు, రెండో ఇన్నింగ్స్‌లోనూ బ్యాటింగ్‌కు రాలేదు. టీమ్ఇండియా విజయావకాశాలను గిల్ గాయం కూడా దెబ్బ తీసింది. అయితే గాయపడిన రోజు రాత్రి అతన్ని ఆసుపత్రిలో ఐసీయూలో ఉంచి పరీక్షలు చేశారు. వర్క్‌లోడ్ వల్ల కాదు.. నిద్రలేమి వల్ల గిల్ మెడ కండరం పట్టేసిందని టీమ్ఇండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ వివరించాడు. అయితే గిల్ ఇంకా గాయం నుంచి పూర్తిగా కోలుకున్నట్లు లేదు. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా రెండో టెస్ట్ శనివారం (నవంబర్ 22) నుంచి గువాహటి వేదికగా జరగనుంది. టీమ్ఇండియా క్రికెటర్లు ఇప్పటికే తమ ప్రాక్టీస్ ప్రారంభించారు. అయితే ఈ సెషన్‌లో శుభ్‌మన్ గిల్ పాల్గొనలేదు. దీంతో అతడు రెండో టెస్ట్ మ్యాచ్‌లోనూ ఆడేది అనుమానంగానే ఉంది. అయితే అసలు అతడు టీమ్‌తో కలిసి గువాహటికి కూడా రాలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రిషభ్ పంత్ రెండో టెస్ట్‌లో భారత్‌కు సారథ్య బాధ్యతలు వహించే అవకాశముంది. అయితే ఈ విషయమై ఇప్పటి వరకైతే బీసీసీఐ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. టీమ్ఇండియా యువ క్రికెటర్లైన ధ్రువ్ జురేల్, ఆకాశ్ దీప్, వాషింగ్టన్ సుందర్, సాయిసుదర్శన్ తదితరులు రెండో టెస్ట్ నేపథ్యంలో ప్రాక్టీస్ సెషన్‌లో శ్రమించారు. తొలి టెస్ట్ ప్రారంభానికి ముందు జట్టులో స్థానం కోల్పోయిన పేస్ బౌలింగ్ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని.. గిల్ గైర్హాజరీ నేపథ్యంలో తిరిగి టీమ్‌లోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. గిల్ స్థానంలో సాయిసుదర్శన్ బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. మొదటి మ్యాచ్‌లో టీమ్ఇండియా 30 పరుగుల తేడాతో ఓటమి పాలవడంతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో 1–0తో వెనకబడిన విషయం తెలిసిందే.

# నాకు చెప్పినట్లుగానే నేను పిచ్ తయారు చేశా
### క్యురేటర్ సుజన్ ముఖర్జీ



టీమ్ఇండియా, దక్షిణాఫ్రికాల మధ్య మూడు రోజుల్లోనే మొదటి టెస్ట్ మ్యాచ్ ముగిసింది. బ్యాటర్లు పరుగులు చేయడానికి ఇబ్బంది పడ్డారు. ఏ జట్టు స్కోరు కూడా కనీసం 200 పరుగులు దాటలేదు. దక్షిణాఫ్రికా కెప్టెన్.. టెంబా బవుమా (55) ఒక్కడే ఈ పిచ్‌పై కాస్తో కూస్తో రన్స్ చేయగలిగాడు. ఈ నేపథ్యంలో కోల్‌కతాలోని ఈడెన్‌గార్డెన్స్ పిచ్‌పై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. వీటిపై క్యురేటర్ సుజన్ ముఖర్జీ స్పందించాడు. తనకు చెప్పినట్లుగానే తాను పిచ్ తయారుచేసిచ్చానని వివరించాడు. ఇందుకోసం తాను పూర్తి అంకితభావంతో పనిచేశానన్నాడు. అందరికీ అన్నీ తెలియవని ఆయన పేర్కొన్నాడు. 'ఈడెన్ గార్డెన్స్ మరీ నాసిరకంగా ఏం లేదు. అందరూ పిచ్‌పై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. నిజాయతీగా చెప్పాలంటే టెస్ట్ మ్యాచ్ కోసం ఎలాంటి పిచ్ తయారు చేయాలో నాకు తెలుసు. భారత శిబిరం చెప్పినట్లుగానే పిచ్ రూపొందించా. ఇతరుల వ్యాఖ్యలను నేను పట్టించుకోను. అందరికీ అన్నీ తెలియవు. నేను నా పనిని పూర్తి అంకితభావంతో చేశా. భవిష్యత్తులోనూ కొనసాగిస్తా' అని ముఖర్జీ ఓ ఇంటర్వ్యూలో అన్నాడు. అంతకుముందు అతడికి బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ కూడా మద్దతుగా నిలిచాడు. 'భారత శిబిరం ఎలాంటి పిచ్‌ను కోరుకుందో అలాంటిదే రూపొందించాం. పిచ్‌పై మ్యాచ్‌కు ముందు నాలుగు రోజులు వాటరింగ్ చేయలేదు. అందుకే అది ఇలా స్పందిస్తోంది. ఈ విషయంలో క్యురేటర్ ముఖర్జీని తప్పు పట్టలేం' అని గంగూలీ స్పష్టంచేశాడు. టీమ్ఇండియా కోచ్.. గౌతమ్ గంభీర్ సైతం తామే ఇలాంటి పిచ్‌ను అడిగామని చెప్పారు. 'మా సూచనల మేరకు ఈడెన్ గార్డెన్స్ పిచ్‌ను సిద్ధం చేశారు. ఇది బ్యాటర్లకు మరీ అంత కఠినమైన పిచ్ ఏమీ కాదు. ఇలాంటిచోట డిఫెన్స్ ఆడాలి. ఓపిగ్గా ఆడితే పరుగులు వస్తాయి' అని అతడు పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 30 రన్స్ తేడాతో టీమ్ఇండియాపై విజయం సాధించింది. 124 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు కేవలం 93కే పరిమితమైంది. రెండో టెస్ట్ మ్యాచ్ గువాహటి వేదికగా శనివారం (నవంబర్ 22) నుంచి ప్రారంభం కానుంది. సిరీస్‌ను సమం చేయాలంటే టీమ్ఇండియా కచ్చితంగా ఈ మ్యాచ్‌లో గెలవాల్సి ఉంటుంది.

# బవుమాను చూసి నేర్చుకోండి
### భారత బ్యాటర్లకు సునీల్ గావస్కర్ సూచన



కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా టీమ్ఇండియా, దక్షిణాఫ్రికా మధ్య తొలి టెస్ట్ జరిగింది. ఈ మ్యాచ్‌లో 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక భారత జట్టు 93 పరుగుల వద్దే చతికిల పడింది. దీంతో సఫారీల జట్టు 30 పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇరు జట్లకు చెందిన బ్యాటర్లు పరుగులు చేయలేక ఇబ్బందిపడ్డారు. కానీ దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా (55) ఒక్కడే అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఇరుజట్లూ ఒక్కసారి కూడా 200 పరుగుల మైలురాయిని అందుకోలేకపోయాయి. ఈ నేపథ్యంలో పిచ్‌పై విమర్శలూ వచ్చాయి. టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ ఈ విషయమై స్పందించాడు. 'భారత బ్యాటర్లు దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమాను చూసి నేర్చుకోవాలి. అతడు అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. మంచి టెక్నిక్, అంకితభావంతో క్రీజులో పాతుకుపోయాడు. దీన్ని దృష్టిలోపెట్టుకొని అయినా.. టీమ్ఇండియా బ్యాటర్లు ఆడి ఉండాల్సింది' అని సునీల్ గావస్కర్ పేర్కొన్నాడు. అలాగే పిచ్ మీద వస్తున్న విమర్శలు, పిచ్ తయారీపై క్యురేటర్‌కు భారత శిబిరం సూచనలు ఇవ్వడంపై అతడు మాట్లాడాడు. 'ఐపీఎల్‌లో ఏ ఒక్క ఫ్రాంఛైజీ కూడా క్యురేటర్ విషయంలో జోక్యం చేసుకోదు. వారికి ఎలాంటి పిచ్ తయారుచేసివ్వాలో సూచించదు. క్యురేటర్ స్వతంత్రంగా విధులు నిర్వహిస్తాడు. అతడు హోం ఫ్రాంఛైజీకి అభిమాని అయితే మాత్రం వారికి అనుకూలంగా పిచ్‌ను తయారుచేస్తాడు. అది కూడా అతని ఇష్ట ప్రకారమే' అని సునీల్ గావస్కర్ అన్నాడు.




## ఎస్‌బీఐ ఖాతాదారులకు అలర్ట్..
### ఇలాంటి మెసేజ్‌లతో జాగ్రత్త

ఎస్‌బీఐ ఖాతాదారులకు అలర్ట్! అమాయకులను లక్ష్యంగా చేసుకొని సైబర్ మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. ఏదో ఒకరకంగా ప్రజల్ని తప్పుదోవపట్టించి వారి బ్యాంకు ఖాతాలను గుల్ల చేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే ఎస్‌బీఐ పేరిట ఓ నకిలీ సందేశాన్ని సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఖాతాదారులకు ఏపీకే ఫైల్స్‌ని పంపి దాన్ని డౌన్‌లోడ్ చేసుకొని ఇన్‌స్టాల్ చేసుకోవాలంటూ మోసపూరిత సూచనలు చేస్తున్నారు. దాంట్లో ఆధార్ వివరాలను అప్‌డేట్ చేయాలని, లేదంటే ఎస్‌బీఐ యోనో యాప్ బ్లాక్ అయిపోతుందంటూ బెదిరింపులకు పాల్పడుతుండటంపై కేంద్రం స్పందించింది. ఇలాంటివి నమ్మొద్దని ప్రజల్ని కోరింది. ఇలాంటి సందేశాలు పూర్తిగా నకిలీవని ప్రజలకు సూచిస్తూ పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. ప్రజలు ఎవరూ ఎలాంటి ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేయడం గానీ, తమ వ్యక్తిగత, బ్యాంకింగ్, ఆధార్ వంటి వివరాలను షేర్ చేయడం వంటివి చేయొద్దని విజ్ఞప్తి చేసింది. ఏవైనా అనుమానాస్పద సందేశాలు మీ దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకొనేందుకు వీలుగా pishing@sbi.co.inకు రిపోర్టు చేయాలని ఈ సందర్భంగా కోరింది. మరోవైపు, ఇలాంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ సైతం విజ్ఞప్తి చేస్తోంది. "క్లిక్ చేసే ముందు ఆలోచించండి. బ్యాంకింగ్ యాప్‌ని అప్‌డేట్ చేసుకోవాలని చెబుతూ నకిలీ ఏపీకే లింకులను మోసగాళ్లు పంపిస్తున్నారు.. ఇది మీ సొమ్మును చోరీ చేసే ఓ స్కామ్. అలాంటివి ఏవైనా వస్తే క్లిక్ చేయొద్దు.. డౌన్‌లోడ్ చేయొద్దు.. అప్‌డేట్ చేయొద్దు. యాప్‌లను కేవలం ప్లే స్టోర్ లేదా యాప్ స్టోర్ నుంచే డౌన్‌లోడ్ చేసుకోండి. ఏవైనా సైబర్ మోసాలకు 1930కు రిపోర్టు చేయండి" అని విజ్ఞప్తి చేసింది.



## బెజోస్ 'కాపీక్యాట్':
### ఎద్దేవా చేసిన ఎలాన్ మస్క్

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరో బిలియనీర్ జెఫ్ బెజోస్‌పై విమర్శలు చేశారు. ఎక్స్ వేదికగా వ్యంగ్యంగా పోస్ట్ పెట్టారు. అసలు ఏం జరిగిందంటే..? కొత్త ఏఐ ప్లాట్‌ఫామ్‌ను తీసుకురానున్నట్లు అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ప్రకటించారు. దానికి ఆయన కో-సీఈఓగా వ్యవహరించనున్నారు. కంప్యూటర్లు, ఏరోస్పేస్, ఆటోమొబైల్స్ వంటి రంగాల్లో ఏఐ ఉత్పత్తులను తీసుకురానున్నట్లు వెల్లడించారు. దీనిపై వెంటనే టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ నుంచి స్పందన వచ్చింది. అసలు అలా జరగదని పోస్టు పెట్టిన ఆయన.. కాపీక్యాట్ అని ఎద్దేవా చేశారు. ఇలా బెజోస్‌ను మస్క్ విమర్శించడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ ఇంటర్నెట్ బీమింగ్ శాటిలైట్స్ నిర్మాణం, అలాగే సెల్ఫ్ డ్రైవింగ్ కార్ స్టార్టప్ జూక్స్ కొనుగోలు గురించి ప్రకటించినప్పుడు కూడా ఈ కాపీక్యాట్ పదాన్నే వాడారు. అవి తన స్పేస్‌ఎక్స్, టెస్లా సంస్థలకు పోటీ అని భావించి అప్పట్లో ఈ విమర్శలు చేశారు. అంతరిక్ష అన్వేషణ, శాటిలైట్ ఇంటర్నెట్, కృత్రిమమేధ ఇలా ఏ రంగం చూసుకున్నా.. వీరిద్దరి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇప్పటికే మస్క్‌కు చెందిన ఎక్స్‌ఏఐ.. గ్రోక్ మోడల్‌ను లాంచ్ చేసింది. అది ఓపెన్ ఏఐ, గూగుల్‌తో పోటీపడుతోంది. ప్రాజెక్ట్ ప్రొమెతియస్‌తో అది మరింత తీవ్రం కానుంది. గూగుల్ మాజీ సైంటిస్ట్ విక్ బజాజ్ ఈ ప్రాజెక్ట్‌ను నడిపించనున్నారు. ఈ ఏఐ వేదిక కోసం ఇప్పటికే 6.2 బిలియన్ డాలర్లను సమీకరించారు. ప్రారంభదశలో ఈ స్థాయిలో నిధులు అందుబాటులో ఉన్న స్టార్టప్ ఇదేనని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఓపెన్‌ఏఐ, డీప్‌మైండ్, మెటా వంటి వాటిల్లో పనిచేసిన నిపుణులు ఇప్పుడు దీనిలో భాగమయ్యారు.

అక్షర రాజముద్ర www.rajamudranews.com ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక



# త్వరలోనే ఉస్తాద్ భగత్ సింగ్ పూర్తి

## దర్శకుడు హరీష్ శంకర్ కీలక ప్రకటన

గబ్బర్‌సింగ్ తర్వాత పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ , హరీశ్ శంకర్ కాంబోలో వస్తున్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్ కొన్ని సన్నివేశాలు మినహా ఈ చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తయింది. మరో పక్క పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సాంగ్‌లో వింటేజ్ లుక్‌ను రివీల్ చేశారు. మళ్లీ ఇప్పటిదాకా సినిమా గురించి ఎలాంటి అప్‌డేట్ లేదు. అయితే సినిమా నుంచి ఫస్ట్ సాంగ్ త్వరలోనే రిలీజ్ చేస్తామంటూ ఇటీవల టీమ్ చిన్న హింట్ ఇచ్చిన సంగతి తెలిసిందే! తాజాగా దర్శకుడు హరీష్ శంకర్ అధికారికంగా వెల్లడించారు. అల్లరి నరేష్ హీరోగా నటించిన 12ఎ రైల్వే కాలనీ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హరీష్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా అప్‌డేట్ గురించి అడగ్గా... చిన్న కరెక్షన్... ఉస్తాద్ గురించి చిన్న న్యూస్ ఉండదు. పెద్ద న్యూస్ ఉంటుంది. డిసెంబరులో ఫస్ట్ సాంగ్ వస్తుంది. త్వరలోనే డేట్ చెబుతాం. డిసెంబర్ 31కి మీకు జోష్ వస్తుందందని చెప్పగా ఫ్యాన్స్ ఫుల్ జోష్ ఫీలయ్యారు. పవన్‌కల్యాణ్ సరసన రాశీఖన్నా, శ్రీలీల నాయికలుగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇటీవల రాశీఖన్నా కూడా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. అలాగే పవన్‌కు సంబంధించిన షూట్ మొత్తం పూర్తయింది.



## టాస్మాక్ కుంభకోణంలో పేరు.. స్పందించిన కయాదు లోహర్

తమిళనాడులో మద్యం రిటైలర్ 'టాస్మాక్' కుంభకోణంలో తన పేరు ఉందంటూ వచ్చిన వార్తలు చూసి ఎంతగానో బాధపడ్డానని నటి కయాదు లోహర్ తెలిపారు. తనపై వచ్చిన రూమర్స్‌పై తాజాగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. తమిళనాడులో సంచలనమైన టాస్మాక్ కుంభకోణంలో భాగమైన వారు నిర్వహించిన ఓ పార్టీకి కయాదు లోహర్ హాజరయ్యారని, అందుకు ఆమె రూ.35 లక్షలు తీసుకున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీన్ని ఆమె ఖండించారు. "ఇలాంటి వార్తలు వచ్చినప్పటికీ బాధపడకుండా ముందుకు సాగడం సులభం అని ప్రజలు అనుకుంటారు. కానీ, అది చాలా కష్టం. ఆ వార్తలు చూసి నేనెంతో బాధపడ్డా. నా కలలను నేరవేర్చుకోవడం కోసం ఇండస్ట్రీలో కష్టపడుతూ ముందుకు సాగుతున్న సమయంలో ఇలాంటి ఆరోపణలు రావడం బాధించింది" అని తెలిపారు. ఇటీవల 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' సినిమాతో కయాదు లోహర్ తెలుగు ప్రేక్షకులనూ అలరించారు. ప్రస్తుతం విశ్వక్‌సేన్ సరసన 'ఫంకీ'లో నటిస్తున్నారు.





## జక్కన్న వ్యాఖ్యలపై వానరసేన మండిపాటు

ఇటీవల హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన వారణాసి సినిమా టైటిల్స్ గ్లింప్స్ వేడుకలో జక్కన్న చేసిన వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బతీశాయని రాష్ట్రీయ వానరసేన ఎస్ఎస్ రాజమౌళిపై సరూర్ నగర్ పోలీసుకు ఫిర్యాదు ఫిర్యాదు చేశారు. ఆయన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని, రాజమౌళి పై కేసు నమోదు చేయాలని వినతి పత్రం అందజేశారు. భవిష్యత్తులో ఎవరూ హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేయకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ వానరసేన సంఘం సభ్యులు పోలీసులను కోరారు. రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన కార్యక్రమంలో సాంకేతిక సమస్య తలెత్తింది. రాజమౌళి బాధతో పాటు అసహనానికి గురయ్యారు. స్టేజి మీద ఆయన మాట్లాడుతూ.. నాకు దేవుడి మీద నమ్మకం లేదు. నా తండ్రి విజయేంద్రప్రసాద్ నాతో మాట్లాడుతూ.. టెన్షన్ పడకు. అంతా హనుమ చూసుకుంటాడు. వెనకుండి నడిపిస్తాడు అన్నారు. కానీ, సాంకేతిక లోపం కారణంగా ఈవెంట్ ఆగినపుడు ఇలాగేనా నడిపించేది అని కోపం వచ్చింది. నా భార్య రమాకు హనుమాన్ అంటే చాలా ఇష్టం. కానీ, ఎందుకిలా అయిందని నాకు కోపం వచ్చింది అని అన్నారు. ఇదిలా ఉండగా మరో చిక్కులో ఇరుక్కున్నారు రాజమౌళి. హనుమంతుడిపై చేసిన వ్యాఖ్యలు వివాదం కొనసాగుతుండగా వారణాసి టైటిల్ పై ఫిల్మ్‌చాంబర్‌లో మరో నిర్మాత ఫిర్యాదు చేశారు. ఈ టైటిల్ తాను ఎప్పుడో రిజిస్టర్ చేసినట్లు తెలిపారు.

## పట్టాలకెక్కనున్న జై హనుమాన్

తేజా సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన హనుమాన్ కి సీక్వెల్‌గా జై హనుమాన్ చిత్రాన్ని ప్రకటించారు దర్శకుడు ప్రశాంత్. ఇందులో ప్రధాన పాత్రలో కన్నడ స్టార్ నటుడు రిషబ్ శెట్టి పోషించనున్నారు. ఈ సినిమాను అనౌన్స్ చేసి చాలా కాలమే అయింది. దీనికి సంబంధించి రిషబ్ లుక్‌ను కూడా విడుదల చేశారు. కానీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. అయితే రిషబ్ బిజీగా ఉండటం, డేట్స్ కుదరక ఈ సినిమా ఇంకా సెట్స్ మీదకి వెళ్లలేదని టాక్. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం పట్టాలెక్కేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. వచ్చే ఏడాది జనవరి నుంచి రిషబ్ వరుసగా ఐదారు నెలలు ప్రశాంత్ వర్మకి కాల్షీట్స్ ఇచ్చినట్లు చిత్ర బృందం నుంచి సమాచారం అందింది. ఈ చిత్రం కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ఇది శుభవార్తే అవుతుంది.అయితే ఈ సినిమా డిలే అవ్వడానికి దర్శకుడు ప్రశాంత్ వర్మ, ÷రెమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నిరంజన్ రెడ్డితో ఉన్న విభేదాలు, ఆర్థిక లావాదేవీలు కూడా ఓ కారణమని తెలుస్తుంది. అయితే దర్శకనిర్మాతలు ఇద్దరు ఆ రచ్చను ఫిల్మ్‌ఛాంబర్‌లో పెట్టారు. వారే ఇష్యూకి సొల్యూషన్ ఇస్తారని దర్శకుడు ఇటీవల ఓ లేఖ ద్వారా తెలిపారు.




## మహారాణి నయన అడుగు పెట్టింది

నందమూరి బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని ఓ చిత్రం తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఎన్‌బీకే 111 వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో కథానాయికగా లేడీ సూపర్ స్టార్ నయనతారను ఎంపిక చేశారు. మంగళవారం నయన్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ సినిమాలో నయనతార మహారాణి పాత్రలో కనిపించనున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. నయనతారకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ సముద్రమంత ప్రశాంతతను, తుపాను అంత బీభత్సాన్ని తనలో మోసే రాణి మా సామ్రాజ్యంలోకి అడుగుపెట్టనుంది అంటూ వీడియో పంచుకున్నారు త్వరలోనే ఈ చిత్రం నుంచి మరిన్ని అప్‌డేట్స్ వస్తాయని వెల్లడించింది. నవంబర్ 26న ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానున్నట్లు తెలిపింది.





## రాజశేఖర్ సరసన మరోమారు రమ్యకృష్ణ

యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్ ఈమధ్య జోరు పెంచిన విషయం తెల్సిందే. హీరోగానే కాకుండా సపోర్టింగ్ రోల్స్ లో కూడా చేయడం మొదలుపెట్టారు. ఇప్పటికే ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన రాజశేఖర్ కు అదేమీ ఆశించిన ఫలితాన్ని అందించలేదు. ఇక ప్రస్తుతం బైకర్ సినిమాలో మంచి పాత్ర చేస్తున్నాడు. ఒకపక్క సపోర్టింగ్ రోల్స్ లో నటిస్తూనే ఇంకోపక్క హీరోగా కూడా రాబోతున్నాడు.తాజా సమాచారం ప్రకారం తమిళ్ లో సూపర్ హిట్ అయిన లబ్బరు పందు సినిమాను రీమేక్ చేస్తున్నట్లు తెలుస్తోంది. హరీష్ కళ్యాణ్, దినేష్, శ్వాసిక, సంజన కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి భారీ విజయాన్ని అందుకుంది. ఇక ఇదే సినిమా ఓటీటీలో తెలుగు వెర్షన్ లో కూడా రిలీజ్ అయ్యి ఇక్కడ కూడా మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఆ సినిమానే రాజశేఖర్ రీమేక్ చేస్తున్నాడు. ఇందులో దినేష్ పాత్రలో రాజశేఖర్ నటిస్తుండగా.. హరీష్ కళ్యాణ్ పాత్రలో విశ్వదేవ్ రాచకొండ నటిస్తున్నాడు. ఇక హీరోయిన్ గా రాజశేఖర్ కుమార్తె శివాని నటిస్తుంది. సినిమా మొత్తానికి హైలైట్ అంటే.. శ్వాసిక పాత్రనే అని చెప్పాలి. క్రికెట్ అంటే పిచ్చి ఉన్న భర్తను.. ఆ పిచ్చి మాన్పించి, అందరి ముద్దు గౌరవంగా నిలబడాలని, ప్రేమించి పెళ్లి చేసుకొని బయటకు వచ్చాకా.. తన కుటుంబానికి అల్లుడును గొప్పగా చూపించాలని ఆరాటపడే పాత్రలో ఆమె ఎంతో అద్భుతంగా నటించింది. ఆ పాత్ర ఎవరు చేస్తారు అనే డైలమా నేటితో తీరిపోయింది. రాజశేఖర్ భార్యగా శివగామి రమ్యకృష్ణను అనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ పాత్రకు ఆమె పర్ఫెక్ట్ అని చెప్పొచ్చు. అంతేకాకుండా రాజశేఖర్ రమ్యకృష్ణ జోడీకి సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. అల్లరి ప్రియుడు లాంటి హిట్ తరువాత వీరిద్దరి కాంబోలో దీర్ఘ సుమంగళీ భవ, బలరామ కృష్ణులు సినిమాలు వచ్చాయి. 1998 తరువాత ఈ జంట మళ్లీ కలిసి కనిపించలేదు. దాదాపు 27 ఏళ్ళ తరువాత మరోసారి ఈ జంట ఈ రీమేక్ తో కలవనున్నారు. అప్పటి కెమిస్ట్రీ ఇప్పుడు కూడా వర్క్ అవుతూ అవుతుందని అంటున్నారు. మరి ఇందులో ఎంత నిజముంది అనేది తెలియాల్సి ఉంది.

## ఇది నాకు ఎమోషనల్ మూవీ

### రామ్ పోతినేని

రామ్ పోతినేని హీరోగా దర్శకుడు పి. మహేశ్‌బాబు తెరకెక్కించిన చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. కన్నడ నటుడు ఉపేంద్ర కీలక పాత్ర పోషించారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. ఉపేంద్ర వీరాభిమానిగా రామ్ నటించారు. ఈ నెల 27న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా కర్నూలులో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. "ఆంధ్ర కింగ్ తాలూకా' నాకు ఎమోషనల్ ఫిల్మ్. ఇలాంటి ఎమోషన్‌ను నా కెరీర్‌లో మరే చిత్రానికి ఫీల్ కాలేదు. వ్యక్తిగతంగా నాకు దగ్గరైన కథ ఇది. సమష్టి కృషితోనే మంచి అవుట్‌పుట్ వస్తుంది. ఇంత అద్భుతంగా ఈ సినిమాని తీసుకొస్తున్న నా టీమ్‌కి థాంక్స్. సంగీత ద్వయం వివేక్- మెర్విన్ ఈ సినిమాతోనే టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. ఉపేంద్ర ఇందులో సూపర్‌స్టార్‌గా నటించారు. హీరోకి, అభిమానికి మధ్య కనెక్షన్ ఎలా ఉంటుందో ఈ సినిమా ద్వారా తెలుస్తుంది. భాగ్యశ్రీ బోర్సే అందంగా కనిపిస్తూనే అద్భుతంగా నటించింది. థియేటర్లలో సౌండ్ చేయడం కాదు మనలోని ఎమోషన్స్‌నూ బయటకు తీసుకొస్తాడు మహేశ్" అని కొనియాడారు. కర్నూలు శివారులో ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రామ్ స్పందిస్తూ.. "ఒక చిన్న తప్పు వల్లే 19 మంది చనిపోయారు. మద్యం సేవించి వాహనం నడపకండి" అని విజ్ఞప్తి చేశారు.





## ప్రియదర్శి, ఆనంది జంటగా 'ప్రేమంటే'

ప్రియదర్శి, ఆనంది జంటగా నటిస్తున్న రిఫ్రెషింగ్ రొమాంటిక్ కామెడీ మూవీ 'ప్రేమంటే'. ఇప్పటికే ఈ చిత్రం నుంచి వచ్చిన ప్రతీ అప్డేట్ ఆకట్టుకోగా.. పాజిటివ్ అంచనాల మధ్య ఈ మూవీ నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో సుమ కనకాల ఒక ముఖ్యమైన పాత్ర చేస్తుండగా ప్రేక్షకులు మరింత ఎగ్జైటింగ్‌గా వెయిట్ చేస్తున్నారు. ఈ సినిమా టీజర్, సాంగ్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ రాగా.. తాజాగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. కొత్తగా పెళ్ళయిన జంట జీవితంలోని ప్రేమ, గొడవలు, సరదాలు, సంతోషాలని ట్రైలర్ ఫన్ రోలర్ కోస్టర్ రైడ్‌లా ప్రజెంట్ చేసింది. ప్రియదర్శి నేచరల్, హ్యూమరస్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకోగా.. ప్రియదర్శి, ఆనంది కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి సిట్యువేషన్ ఎంటర్టైనింగ్‌గా ఉంది. కానిస్టేబుల్ క్యారెక్టర్‌లో సుమ కనకాల తన సిగ్నేచర్ మార్క్‌తో అలరించారు. ట్రైలర్ చివర్లో తను చెప్పిన డైలాగ్ హైలెట్‌గా నిలవగా.. ప్రజెంట్ ఇది నెట్టింట ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. కాగా.. ఈ చిత్రంతో నవనీత్ శ్రీరామ్ డైరెక్టర్‌గా అరంగేట్రం చేస్తున్నారు. పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మాణంలో, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సమర్పిస్తోంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com